మాకు ఎంతో మేలు జరిగింది



మేం బాస్కెట్‌బాల్ క్రీడా పోటీల కోసం విజయనగరం జిల్లా డెంకాడ ఏపీ మోడల్ స్కూల్ నుంచి కాకినాడ జిల్లా పిఠాపురం వెళ్లాం. శుక్రవారం నుంచి కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రకటించడంతో నాతో పాటు ఆరుగురు బాలికలు జీరో ఫేర్ టికెట్‌తో అనకాపల్లి చేరుకున్నాం. ఇక్కడ నుంచి విజయనగరం బస్సులో డెంకాడ వెళతాం. ఈ పథకం వలన మాకు ఎంతో మేలు జరిగింది.

- **ఎన్.వరహాలు**, వ్యాయామ ఉపాధ్యాయిని, ఏపీ మోడల్ స్కూల్, డెంకాడ, విజయనగరం జిల్లా

అతివల ఆనందం

స్త్రీశక్తి పేరిట ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంపై హర్షం

- మహిళల నుంచి విశేష స్పందన
- కూటమి ప్రభుత్వంపై ప్రశంసల జల్లు



అనకాపల్లిలో శనివారం జీరో ఫేర్ టికెట్లను చూపుతున్న మహిళా ప్రయాణికులు

(అనకాపల్లి/అనకాపల్లి టౌన్-ఆంధ్రజ్యోతి)

'ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు మేమంతా రుణపడి ఉంటాం. మాకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించి ఎంతో మేలు చేశారు. మాకు నెలవారీ రవాణా ఖర్చులు తగ్గించారు. స్త్రీశక్తి పథకం ముఖ్యంగా చిరు వ్యాపారులు, విద్యార్థినులకు వరం'.. అని జీరో ఫేర్ టికెట్‌పై ప్రయాణించిన మహిళలు ఆనందం వ్యక్తం చేశారు.

అనకాపల్లి, నర్సీపట్నం ఆర్టీసీ డిపోల పరిధిలో మొత్తం 204 బస్సులు ఉండగా, వీటిలో ఆర్డినరీ, పల్లెవెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు కలిపి మొత్తం 180 బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయాన్ని కల్పిస్తున్నారు. స్త్రీశక్తి పథకం కింద ఐదు రకాల ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించారు. ఆధార్ గుర్తింపు కార్డును మహిళలు కండక్టర్‌కు చూపించి 'జీరో ఫేర్' టికెట్ తీసుకుని ప్రయాణిస్తున్నారు. పథకం ప్రారంభించిన రోజైన శుక్రవారం జిల్లాలో 1,817 మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాన్ని వినియోగించుకోగా, వారికి రూ.63,879 విలువ చేసే జీరో ఫేర్ టికెట్లు ఇచ్చామని జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి ప్రవీణ తెలిపారు. స్త్రీశక్తి ఉచిత బస్సు ప్రయాణం పథకానికి రెండో రోజైన శనివారం స్పందన బాగుందన్నారు. ఈ పథకంపై మహిళలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. రెండు రోజుల్లో 40 రూట్లలో మహిళలకు అవగాహన కల్పించామన్నారు. ప్రస్తుతం సెలవు దినాలు కావడం వల్ల కాస్త తక్కువ మంది మహిళలు ప్రయాణిస్తున్నారని, మామూలు రోజుల్లో రోజువారీ పనులపై వెళ్లేవారే కాకుండా ఉద్యోగులు, విద్యార్థినులు ఉచిత బస్సు పథకాన్ని వినియోగించుకుంటారని తెలిపారు. కాగా శనివారం డీపీటీవో వి.ప్రవీణ, డిపో అసిస్టెంట్ మేనేజర్ జి.వి. గౌరీ ఎలమంచిలి వెళ్లే బస్సు ఎక్కి ప్రయాణికులతో మాట్లాడారు. బస్సులో ప్రయాణిస్తున్న మహిళా ప్రయాణికులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు చేసిన ఈ పథకం చాలా సంతోషాన్ని ఇచ్చిందని వారికి చెప్పారు. అనకాపల్లి కాంప్లెక్స్‌లో దిగిన పలువురు మహిళలతో డీపీటీవో ప్రవీణ, ఏడీఎం జి.వి.గౌరిలు ప్రయాణం ఎలా సాగిందని, టికెట్ డబ్బులిచ్చి కొన్నారా?, ఆధార్ కార్డు చూపించి ఉచితంగా ప్రయాణించారా ? అని అడిగి ... మిగతా 8వ పేజీలో



పాయకరావుపేటలో ప్రయాణికురాలు ఆధార్ కార్డు చూడడంతో ఉచిత టికెట్ ఇస్తున్న కండక్టర్

రవాణా ఖర్చులు తగ్గాయి



స్త్రీశక్తి పథకం మహిళలకు వరం. ఉచిత బస్సు ప్రయాణం వలన మాకు రవాణా ఖర్చులు తగ్గాయి. ముఖ్యంగా విద్యార్థినులు, చిరు వ్యాపారులకు దీని వల్ల ఎంతో ప్రయోజనం ఉంది.

- కె.రాజేశ్వరి. లైనుకొత్తూరు, ఎలమంచిలి

మాలాంటి పేదలకు ఎంతో ఉపయోగం



ఎక్కడికైనా ప్రయాణం చేయాలంటే బస్సు ఖర్చుల కోసం పనులు చేసి డబ్బులు దాచుకోవాల్సి వచ్చేది. అదే అర్జంట్ అయితే అప్పుచేసి వెళ్లాల్సి వచ్చేది. కూటమి ప్రభుత్వం మాకు ఉచిత బస్సు ప్రయాణానికి అవకాశం ఇవ్వడంతో బస్సు చార్జీల కోసం చూడాల్సిన అవసరం లేదు. ఇది మాలాంటి పేదలకు ఎంతో ఉపయోగం. ఇప్పుడు నేను పాయకరావుపేట నుంచి అనకాపల్లికి పైసా ఖర్చులేకుండా వెళుతున్నాను. నాకు చాలా ఆనందంగా ఉంది. మేమంతా ముఖ్యమంత్రి చంద్రబాబుకు రుణపడి ఉంటాం.

- ఆళ్ళ సూర్యకాంతం, తుని

పోలీస్ స్టేషన్లలో సెటిల్‌మెంట్లు!

భూవివాదాలు, కుటుంబ తగాదాల్లో తలదూర్చుతున్న ఖాకీలు

- రూ.50 వేలు లంచం తీసుకుంటూ ఇటీవల పట్టుబడిన ఎస్ఐ
- ఎవరైనా ఫిర్యాదు చేయడానికి వస్తే కేసు నమోదు చేయకుండా బేరసారాలు
- పారిశ్రామిక వేత్తలకూ తప్పని ఇబ్బందులు

ఇటీవల ఏసీబీకి పట్టుబడిన ఎస్ఐ పనిచేసిన అనకాపల్లి పట్టణ పోలీస్ స్టేషన్



(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లు ప్రైవేటు సెటిల్‌మెంట్లకు అడ్డాగా మారాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సివిల్ కేసులు, భూవివాదాల్లో తలదూర్చొద్దని ఉన్నతాధికారులు పదే పదే చెబుతున్నా జిల్లాలో కొందరు ఖాకీలు కాసుల యావలో పడి పోలీస్ స్టేషన్లను ప్రైవేటు పంచాయతీ సెటిల్‌మెంట్ కేంద్రాలుగా మార్చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల పెందుర్తికి చెందిన ఒక బంగారం వ్యాపారి న్యాయం కోసం అనకాపల్లి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే, ఆ వ్యాపారికి న్యాయం చేయకపోగా పట్టణ ఎస్ఐ ఈశ్వరరావు అతని నుంచి రూ.50 వేలు లంచం తీసుకొంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండడ్‌గా పట్టుబడడం జిల్లా పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నం, పరవాడ పోలీస్ సబ్ డివిజన్లు ఉండగా, 25 పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. ప్రతి పోలీస్ స్టేషన్‌కు ఒక సీఐ, ఇద్దరు లేదా ముగ్గురు సబ్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. కాగా అనకాపల్లి జిల్లా కేంద్రంగా మారడం, పలు భారీ పరిశ్రమలు వస్తుండడంతో జిల్లా వ్యాప్తంగా దాదాపు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. అదే స్థాయిలో సివిల్ కేసులు, భూదందాలు, భూ ఆక్రమణలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. భూకబ్జాలు, ఆక్రమణలకు సంబంధించిన వివాదాలన్నీ పోలీస్ స్టేషన్లకే వెళుతున్నాయి. దీంతో ఎవరైనా న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వస్తే, కేసు నమోదు చేయకుండా ముందుగా పోలీసులే ప్రైవేటు పంచాయతీలు నిర్వహిస్తున్నట్టు తెలిసింది. ఇటీవల అనకాపల్లి పట్టణ పరిధిలోని నిదానందొడ్డి ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి తన ఇంటి జాగాలోకి వేరొకరు ప్రవేశిస్తున్నారని పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కనీసం ఫిర్యాదు తీసుకోలేదు. దీంతో ఆయన న్యాయం కోసం కోర్టును ఆశ్రయించారు. పిసినికాడ గ్రామంలో సర్వే నంబర్ 38/1లోని ఒక ప్రైవేటు లేఅవుట్‌కు రోడ్డు విషయంలో తమకు న్యాయం చేయాలని కొందరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వారి ఫిర్యాదును పట్టించుకోకపోగా, లేఅవుట్ యజమానితో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో తమకు న్యాయం చేయాలంటూ బాధితులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఒక్క అనకాపల్లి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోనే కాదు జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నం, పరవాడ పోలీస్ డివిజన్‌ల పరిధిలోని దాదాపు అన్ని పోలీస్ స్టేషన్లలో రోజూ భూ వివాదాలు, కుటుంబ తగాదాలపై సెటిల్‌మెంట్లు ... మిగతా 8వ పేజీలో

వణుకుతున్న వంతెనలు

శిథిలావస్థకు చేరిన బ్రిటిష్ కాలం నాటి బ్రిడ్జిలు

- అప్పటి నుంచి మరమ్మతులకు నోచుకోని వైనం
- తాళ్లపాలెంలో అధిక లోడుతో వెళ్లే వాహనాలకు పోలీసులు కేసులు రాస్తుండడంతో రూటు మార్చిన డ్రైవర్లు
- పెదబొడ్డేపల్లి నుంచి కోటవురట్ల మీదుగా రాకపోకలు
- భారీ వాహనాలు వెళ్లే సమయంలో వంతెనలపై ప్రకంపనలు
- ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భీతిల్లుతున్న జనం

కోటవురట్ల, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పురాతన వంతెనలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ వంతెనలు 125 ఏళ్ల క్రితం బ్రిటిష్ పాలకుల హయాంలో నిర్మించినవి. అప్పటి నుంచి ఇవి ఎటువంటి మరమ్మతులకు నోచు కోలేదు. వీటి పైనుంచి భారీ వాహనాలు వెళుతున్నప్పుడు ప్రకంపనలు వస్తున్నాయని ఆ ప్రాంతవాసులు చెబుతున్నారు.



పోలీసులు పట్టుకున్న వాహనాలు (ఫైల్)



బలహీనంగా ఉన్న రాట్నాలపాలెం వంతెన

మండలంలో చిన్నవి ఆరు, పెద్దవి నాలుగు పురాతన వంతెనలు ఉన్నాయి. వీటికి ఇప్పటి వరకు ఎటువంటి మరమ్మతులు చేయలేదు. దీంతో చాలా వరకు బలహీనంగా ఉన్నాయి. కాగా నర్సీపట్నం నుంచి కోటవురట్ల మీదుగా రేవుపోలవరం అడ్డురోడ్డు వెళ్లే మార్గంలోని వంతెన శిథిలావస్థకు చేరింది. ఏ క్షణంలోనైనా కూలిపోయే పరిస్థితిలో ఉంది. నర్సీపట్నం నుంచి అడ్డురోడ్డు వెళ్లే ప్రధాన రహదారిలో పది టన్నుల లోడు సామర్థ్యం ఉన్న వాహనాలకు మాత్రమే రాకపోకలకు ... మిగతా 8వ పేజీలో

రంపచోడవరం టు నర్సీపట్నం

సోమిద మానుల అక్రమ రవాణా

- ధ్వజ స్తంభాలకు ఉపయోగించే విలువైన సోమిద చెట్టు
- పర్మిట్ లేకుండా సీఫీజు రాసి విడిచి పెట్టిన ఫోక్స్‌పేట అటవీ అధికారులు
- రూ.లక్షకు పైగా చేతులు మారినట్టు సమాచారం
- పట్టుకున్న నర్సీపట్నం రేంజర్



ధ్వజ స్తంభాలకు వాడే సోమిద కర్ర

నర్సీపట్నం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం అటవీ డివిజన్ ఫోక్స్‌పేట రేంజ్ నుంచి అక్రమ రవాణా అవుతున్న సోమిద చెట్టు కర్రను నర్సీపట్నం రేంజర్ పట్టుకున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా గంగవరం మండలం చీడిపాలెం నుంచి రెండు సోమిద మానులు ట్రాక్టర్‌లో అక్రమ రవాణా అవుతున్నదని నర్సీపట్నం అటవీ ... మిగతా 8వ పేజీలో

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



కొత్తూరులోని మొల్లి వీధిలో విశేష అలంకరణలో శ్రీకృష్ణుడు

జిల్లాలో శనివారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా జరుపు కున్నారు. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. శ్రీకృష్ణుడి విగ్రహాలను విశేషంగా అలంకరించారు. అనకాపల్లి, చోడవరం, మాడుగుల, పాయకరావుపేట, నర్సీపట్నం, ఎలమంచిలి, తదితర ప్రాంతాల్లోని శ్రీకృష్ణ మందిరాలను అందంగా అలంకరించారు. వేకువజాము నుంచే భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. పలు చోట్ల ఉట్టి సంబరాలను చేసుకున్నారు.

- అనకాపల్లి టౌన్/ఆంధ్రజ్యోతి

ట్రాఫిక్ పద్మవ్యూహం

నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు రద్దీ

- కళాశాలలు, పాఠశాలలు విడిచి పెట్టే సమయంలో మరీ ఘోరం
- ఇరుకు రోడ్లతో అవస్థలు
- వాహనచోదకుల ఇక్కట్లు



మెయిన్ రోడ్డులో నిలిచిపోయిన ట్రాఫిక్ (ఫైల్)

నర్సీపట్నం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ట్రాఫిక్ సమస్య నరకప్రాయంగా మారింది. సబ్ కలెక్టర్ కార్యాలయం దాటిన తరువాత పాత ఎస్‌బీఐ కూడలి నుంచి శ్రీదుర్గామల్లేశ్వర స్వామి ఆలయం వరకు, అబీద్ సెంటర్ నుంచి పోలీస్ స్టేషన్, అబీద్ సెంటర్ నుంచి ఐదు రోడ్లు కూడలి వరకు అడుగు తీసి అడుగు పెట్టలేని విధంగా ట్రాఫిక్ రద్దీ పెరిగిపోయింది. సబ్ కలెక్టర్ కార్యాలయం దాటిన తరువాత మెయిన్ రోడ్డు ఇరుకుగా ఉండడం, దీనికి తోడు దుకాణ సముదాయాల ఎదుట ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేయడం వలనే ఈ సమస్య నెలకొంది. పండుగలు, ప్రత్యేక దినాల్లో పట్టణ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి మార్కెట్ చేయడానికి వచ్చేవారు అధికంగా ఉంటున్నారు. దీంతో మెయిన్ రోడ్డు కిక్కిరిసిపోయి తప్పుకోవడమే కష్టతరంగా ఉంటున్నది. ద్విచక్ర వాహనాలు, కార్ల వినియోగం బాగా పెరిగింది. వేల సంఖ్యలో ఆటోలు రాకపోకలు సాగిస్తున్నాయి. పగటి వేళలో నల్లరాయి టిప్పర్లను పట్టణంలోకి పోలీసులు అనుమతించడం ఈ సమస్యను మరింత జఠిలం చేస్తున్నది. దుకాణ సముదాయాలు పెరిగాయి. షాపింగ్ మాల్స్, వస్త్ర, నగల దుకాణాలు మార్కెట్ పెరిగింది. వాహనాల రద్దీకి అనుగుణంగా పట్టణంలో రోడ్లు వెడల్పుగా ... మిగతా 8వ పేజీలో

అభివృద్ధి, సంక్షేమంపై గ్రామాల్లో ప్రచారం చేయండి

» త్వరలో రాంబిల్లిలో టీడీపీ కార్యాలయం ఏర్పాటు

» పార్టీ మండల శాఖ అధ్యక్షుడు లాలం భరత్



పార్టీ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న లాలం భరత్

రాంబిల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు విస్తృతంగా వివరించాలని ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు లాలం భరత్ పిలుపునిచ్చారు. లాలంకోడూరులోని ఆయన నివాసంలో శనివారం నిర్వహించిన పార్టీ శ్రేణుల సమావేశంలో మాట్లాడారు. అప్పుల ఊబిలో ఉన్న రాష్ట్రాన్ని ప్రగతి పథాన నడిపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. గ్రామాల్లో సమస్యలను తన దృష్టికి తీసుకు వస్తే ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, ఆయా శాఖల అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. నాయకులు, కార్యకర్తలంతా ఐక్యంగా ఉండి గ్రామాల్లో పార్టీని మరింత బలోపేతం చేయలన్నారు. ముఖ్యంగా సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేయాలన్నారు. త్వరలో రాంబిల్లి టీడీపీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కొరెడ్ల ఈశ్వరరావు, మాజీ ప్రధాన కార్యదర్శి లాలం తాతబాబు, మండల తెలుగు యువత అధ్యక్షుడు ఎరిపల్లి అజయ్, మాజీ సర్పంచ్‌లు ఎరిపిల్లి చిట్టిబాబు, ఎస్. నాగేశ్వరరావు, వేగిరాము, న్యాయవాది రవిరాజు, నాయకులు చెల్లూరి ఆనంద్, యశ్వంత్, అప్పారావు, అప్పలరాజు, బాబూరావు, ఎన్.సుబ్బయ్య, శీరా వెంకటరావు, అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ బలోపేతానికి సమష్టి కృషి : ధర్మశ్రీ



జంపపాలెంలో కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న కరణం ధర్మశ్రీ

ఎలమంచిలి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో వైసీపీని బలోపేతం చేసేందుకు అంతా సమష్టిగా కృషి చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కరణం ధర్మశ్రీ పిలుపునిచ్చారు. మండలంలోని జంపపాలెం, తురంగలపాలెం, షేకిళ్లపాలెం గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశాల్లో మాట్లాడుతూ గ్రామ కమిటీల ఏర్పాటు సత్వరం పూర్తి చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోదెపు గోవింద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర, మునిసిపల్ కో-ఆప్షన్ సభ్యుడు దూది నరసింహమూర్తి,శ్రీరాములు నాయుడు తదితరులు పాల్గొన్నారు.



మునిసిపాలిటీ పరిధి యర్రవరం కృష్ణుని ఆలయంలో భక్తుల సందడి



రాంబిల్లి మండలం గోవిందపాలెంలో...

కన్నులపండువగా కృష్ణాష్టమి

ఎలమంచిలి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాష్టమి వేడుకలను ప్రజలంతా శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని కాకివాని వీధి, యర్రవరం, గొల్లలపాలెం వార్డులతో పాటు పీఎస్ఆర్‌పేట, ఏటికొప్పాక తదితర గ్రామాల్లో వేకువజాము నుంచి స్వామివారి ఆలయాల్లో విశేష పూజలు ప్రారంభమయ్యాయి. కొత్తపేట సీతారాముల ఆలయం ఆవరణతో పాటు, యర్రవరం వార్డులో ఉట్టి సంబరం ఉత్సాహం సాగింది. మహిళల కోలాటాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాల్లో జనసేన నేత పిట్టా శ్రీను, రాష్ట్ర టైలర్స్ అసోసియేషన్ ప్రతినిధి వియ్యపు సత్తిబాబు, కమిటీ ప్రతినిధి ధూళి అప్పల చిట్టి, కోన శంకర్రావు, గొలగాని సన్నిబాబు, నంబూరు నీలాద్రి, కిల్లాడి సత్తిబాబు, కాకివాని వీధిలో చిరంజీవితో పాటు పెద్ద సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం మండలంలో...

అచ్యుతాపురం : మండలంలో కృష్ణాష్టమిని అంతా ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. అచ్యుతాపురం, మోసయ్యపేట తదితర గ్రామాల్లో గల స్వామి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. అచ్యుతాపురం శ్రీకృష్ణాలయంలో స్వామివారిని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు దర్శించుకున్నారు.మోసయ్యపేటలో కృష్ణుని విగ్రహాన్ని ఊరేగించారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నసమారాధనలు జరిపారు. వేడుకల్లో కూనిశెట్టి రమణ, పత్రే శ్రీనివాస యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



అచ్యుతాపురంలో శ్రీకృష్ణుడ్ని దర్శించుకుంటున్న ప్రగడ నాగేశ్వరరావు, తదితరులు

మునగపాక మండలంలో...

మునగపాక : శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను మండలంలో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మునగపాక ఎన్టీఆర్ కాలనీ, సంతబయలుతో పాటు ఒంపోలు, పాటిపల్లి, గొల్లలపాలెం, వాడ్రాపల్లి, రామగిరి, గవర్ల అనకాపల్లి గ్రామాల్లో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. పలువురు శ్రీకృష్ణ మాలలను ధరించారు. ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రాంబిల్లి మండలంలో...

రాంబిల్లి : మండలంలోని గోవిందపాలెం, హరిపురం, వెంకటాపురం, సంతపాలెం, ధారభోగాపురం తదితర గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆయా కమిటీల సభ్యులు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు.

సన్మార్గానికి ధ్యానం ద్వారం వంటిది



మాట్లాడుతున్న ఫణిభూషణ్ శ్రీధర్

మునగపాక, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, దానిని జయించడమే తొలి విజయమని జీవ వైవిధ్య సంరక్ష అవార్డు గ్రహీత కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ అన్నారు. నాగులాపల్లిలో శనివారం జరిగిన చంద్రశేఖర మహాస్వామి పిరమిడ్ ధ్యాన కేంద్రం ఏడవ వార్షికోత్సవంలో మాట్లాడారు. సన్మార్గానికి ధ్యానం ద్వారం వంటిదని వివరించారు. అన్నివర్గాల ప్రజలకు ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగించేందుకు ధ్యాన కేంద్రం నిర్వాహకురాలు సుజాత చేస్తున్న కృషిని ప్రశంసించారు. అనంతరం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఖాజీపాలెం హైస్కూల్‌కు ఫర్నీచర్ వితరణ

అచ్యుతాపురం రూరల్, ఆగస్టు 16, (ఆంధ్రజ్యోతి) : ఖాజీపాలెం హైస్కూల్‌కు టీడీపీ మండల అధ్యక్షుడు పీలా తులసీరామ్, గ్రామ నాయకుడు పీలా సందీప్ తమ సొంత నిధులు రూ.లక్షతో టేబుళ్లు, కుర్చీలు, బీరువా తదితర సామగ్రిని సమకూర్చారు. ఈ మేరకు శనివారం ప్రధానోపాధ్యాయుడు శేషుకు వాటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠ శాల ప్రధానోపాధ్యాయిని ఎం.భారతి తదితరులు పాల్గొన్నారు.

'మునగపాకలో ఇండోర్ కళావేదిక నిర్మాణం'



భరతనాట్యం, కూచిపూడి కళాకారులతో ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రం మునగపాకలో ఇండోర్ కళావేదిక నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించామని, త్వరలో కార్యరూపం దాల్చనుందని ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ తెలిపారు. ఇక్కడి నందీశ్వర ప్రాంగణం, తులసీ కళావేదికపై గ్రామీణ యువజన మందిరం 61వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం రాత్రి ముగిసిన సందర్భంగా ముఖ్య అతిథిగా మాట్లాడారు. బళ్లారిలో ప్రతి రోజూ నాటక ప్రదర్శనలుంటాయని ఆ విధానం మునగపాకలో చూడాలని ఉందన్నారు. ఈ సందర్భంగా దాడి జగన్నాథరావు రచించిన 'గీత దాటితే' నాటికను నటరాజా ఆర్ట్స్ కళాకారులు అద్భుతంగా ప్రదర్శించారు. సత్యశ్రీనివాసరావు దర్శకత్వం వహించారు. అలాగే, ఐ కిడ్స్ అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్యం ఆకట్టుకున్నాయి. అనంతరం రంగస్థల నటుడు, దర్శకుడు దాడి ముసిలినాయుడును ఎమ్మెల్యే రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ సత్కరించారు. మందిరం అధ్యక్షుడు ఆడారి శ్రీకాంత్, గవర కార్పొరేషన్, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్లు భీమరశెట్టి శ్రీను, డొక్కా నాగభూషణం పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ రాంబిల్లి మండల కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



ప్రతిజ్ఞ చేస్తున్న ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గ సభ్యులు

అచ్యుతాపురం రూరల్/ రాంబిల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ మండల నూతన అధ్యక్షుడిగా డీవీఎస్ఎన్ రాజు (కిరణ్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వెంకటాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన ఫెడరేషన్ సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా అప్పాజీతో పాటు మరికొందరు ఎన్నికయ్యారు. రాష్ట్ర కౌన్సిలర్ కె.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బి.వెంకటపతిరాజు, ఎన్‌వీసూర్యనారాయణ, కేకేఎల్ఎంఎన్ ధర్మారావుతో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా లింగంనాయుడు జన్మదిన వేడుకలు



లింగంనాయుడుని అభినందిస్తున్న టీడీపీ నాయకులు

కోటవురట్ల , ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి) : టీడీపీ మండల అధ్యక్షుడు పెట్ల లింగంనాయుడు జన్మదిన వేడుకలు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా శనివారం నిర్వహించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో కేక్‌కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, పాయకరావుపేట నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, ఎస్. రాయవరం మండల పార్టీ అధ్యక్షుడు అబద్దం, కోటవురట్ల పీఏసీఎస్ అధ్యక్షుడు వేచలపు జనార్ధన్, మండల సీనియర్ నాయకులు జాను శ్రీను, సుంకర బాబ్జీ, పలుగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వాజ్‌పేయి ఆదర్శప్రాయులు



వాజ్‌పేయికి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

నక్కపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ప్రధానిగా దేశాభివృద్ధికి ఎన్నో విప్లవాత్మకమైన సంస్కరణలు చేపట్టిన ఘనత దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయికి దక్కుతుందని బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి పి.రవిరాజు అన్నారు. శనివారం నక్కపల్లిలో వాజ్‌పాయి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు రవిరాజు, కోసూరి శ్రీను, పోలినాటి నానాజీ, కొల్నాటి శవ, నున్న జ్యోతి కృష్ణ, ఈగల వెంకటేశ్వరరావు, బంగారు శివ తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ప్రధానిగా వాజ్‌పాయి చేసిన సేవలను వివరించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఎస్. రాయవరం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్. రాయవరం రూరల్, చినగుమ్ములూరు, పెద గుమ్ములూరు ఫీడర్ల పరిధిలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ కె. రాజశేఖర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వెంకటాపురం, ఉప్పరాపల్లి, లింగరాజుపాలెం, జేపీ పాలెం, సర్వసిద్ధి, కర్రివానిపాలెం, బసవపాడు, సైతారుపే ట, వాకపాడు, పెట్టుగోళ్ళపల్లి, నీలాద్రిపురం, రామయ్యప ట్నం, పెదగుమ్ములూరు, భీమవరం, గోకులపాడు గ్రామాలతో పాటు నక్కపల్లి మండలం పెదరామకృష్ణపురం, పెదబోధిగళ్లం, సీతమ్మపాలెం, దొడ్డుగొల్లు గ్రామాల్లో ఆర్‌డీఎస్ ఎస్ పనుల్లో భాగంగా ఈ అసౌకర్యానికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఈఈ ఈ సందర్భంగా కోరారు.



పాయకరావుపేట గొల్లవీధి కృష్ణాలయంలో పూజలు నిర్వహిస్తున్న టీడీపీ నేతలు



వేంపాడులో జరిగిన ఉట్టి కొట్టే వేడుకలో గ్రామస్థులు

గోకులకృష్ణా.. గోపాలకృష్ణా..

» ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



బోయపాడులో శ్రీకృష్ణుడు

పాయకరావుపేట: శ్రీకృష్ణాష్టమి వేడుకలు పాయకరావుపేటలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో ప్ర త్యేక పూజలు, గోవులకు పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణుడు ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇళ్లలో తమ పిల్లలను చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలతో అలంకరించారు. పట్టణంలోని పాండురంగస్వామి ఆలయంతోపాటు గొల్లపేట శ్రీకృష్ణాలయంలో విశేష పూజలు నిర్వ హించారు. టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ మాజీ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీనుతో పాటు నాయకులు చింత కాయల రాంబాబు, జూరెడ్డి ప్రసాద్, పల్లా విలియంకేరి, వేములపూడి అప్పారావు, దువ్వి శ్రీను తదితరులు పాల్గొన్నారు. స్థానిక బృందావనంలోని దుర్గాలమ్మ చెట్టు ఆలయ ప్రాం గణంలో ఉన్న కృష్ణుడి ఆలయంలో శ్రీకృష్ణాష్టమిని కన్నుల పండువగా నిర్వహించారు. సాయంత్రం పలు చోట్ల ఉట్టికొట్టే సంబరం నిర్వహించారు.

శ్రీప్రకాష్‌లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

పాయకరావుపేట : స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్న బాలవనం నుంచి 2వ తరగతి చదువు తున్న చిన్నారులు చిన్ని కృష్ణ డు, గోపికల వేషధా రణతో సందడి చేశారు.ఉట్టి కొట్టే కార్యక్రమం ఆకట్టుకుంది. కృష్ణ శతక పద్యాలు పఠిం చి, కృష్ణుడి జననం, లీలలను నృత్య గానాలతో ప్రదర్శించి ఆహూతులను అలరించారు.

పాయకరావుపేట రూరల్: పెద్దిపాలెం, గోపాలపట్నం, పెంటకోట, శ్రీరాంపురం, మంగవరం, నామవరం, సీతారాంపురం, కుమారపురం, ఎస్.నర్సాపురంల్లో భక్తులు శ్రీకృష్ణుని మందిరాల్లో పూజలు నిర్వహించారు. గో పూజ చేశా రు.

నక్కపల్లిలో..

మండలంలోని బోయపాడు మత్స్యకార గ్రామంలో కృష్ణమందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. బాలికల కోలాట ప్రదర్శనలు అలరించాయి. చినదొడ్డిగల్లు, గొడిచెర్లల్లోని కృష్ణమందిరాలను భక్తులు దర్శించుకున్నారు. ఉపమాక శివారు మామిడివానిపాలెం, కొర్రవానిపాలెం గ్రామాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు జరిగాయి. ముగ్గుల పోటీలు నిర్వహించారు. వేంపాడు, దేవవరం, ముకుందరాజుపేట, రమణయ్యపేటలోనూ ఈ వేడుకలు జరిగాయి. మధ్యాహ్నం అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. వేంపాడు గ్రామంలో సాయంత్రం ఉట్ల సంబరం జరిగింది.

ఎస్. రాయవరంలో..

ఎస్. రాయవరం: మండలంలోని కోనవానిపాలెం, పెట్టుగోళ్ళపల్లి, ధర్మవరం అగ్రహారం, పెదగుమ్ములూరు, గుర్రాజు పే ట తదితర గ్రామాల్లోని శ్రీకృష్ణుని ఆలయాల్లో ప్రత్యేక పూ జలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధనలు ఏర్పా టు చేశారు. పలు గ్రామాల్లో నిర్వహించిన వేడుకల్లో మాజీ ఎంపీపీ యేజెర్ల వినోద్‌రాజు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు ఎన్ వెంకటరాజు,కొరుప్రోలు పీఏసీఎస్ చైర్‌పర్సన్ గుర్రం రామకృష్ణ తదితర నాయకులు పాల్గొన్నారు. అడ్డరోడ్డు తిమ్మాపురంలో త్రైత సిద్ధాంతం వారి ప్రబోధ సేవా సమితి, ఇందు జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కృష్ణ జన్మాష్టమి వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి విశిష్టత, భగవద్గీత గొప్పతనంతో పాటు సనాతన ధర్మం ఆవశ్యక తను భక్తులకు వివరించారు. అల్లు మోహన్, ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు శేఖర్‌బాబు, శాంతరాజు, సత్యనారాయణ, జగన్ తదితరులు పాల్గొన్నారు.



పెట్టుగోళ్ళపల్లి శ్రీకృష్ణుని ఆలయంలో పూజలు

మత్స్యకారులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

» జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోసా అప్పలరాజు

పాయకరావుపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మత్స్యకారులకు ప్రభుత్వం రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోసా అప్పలరాజు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సంఘం కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అనకాపల్లి జిల్లాలో జాతీయ మత్స్యకార సంఘం నూతన కమిటీల ఎంపిక నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న 14 కులాల మత్స్యకారులను ప్రభుత్వాలు విభజించి పాలిస్తున్నాయని ఆరోపించారు.



నాఫ్ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జిగా పిక్కి కొర్లయ్యకు నియామక పత్రం అందజేస్తున్న అప్పలరాజు

తీర ప్రాంతంలో పరిశ్రమలతో నష్టం

ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఏపీలోని తీరప్రాంతంలో విషపూరితమైన పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వాలు అనుమ తులు ఇస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. వీటిలో మత్స్యకారుల జీవనానికి తీరని నష్టం జరుగుతోందన్నారు. వీటిపై మత్స్యకారులకు అవగాహన కల్పనకు రాష్ట్రంలోని గ్రామ, మండల, జిల్లా స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. అలాగే, మత్స్యకారులకు జరుగుతున్న నష్టాలు, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు నివెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాఫ్ జిల్లా మాజీ అధ్యక్షుడు కొవిరి వెంకటేష్, ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి పిక్కి కొర్లయ్య, నక్కపల్లి, పాయకరావుపేట మండలాల అధ్యక్షులు ఎరిపిల్లి అప్పలరాజు, సూరాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌతు లచ్చన్న జయంతి



గుర్రాజుపేటలో గౌతు లచ్చన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పాండురంగ తదితరులు

ఎస్. రాయవరం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని ప్రభుత్వం ఆధ్వర్యంలో జరపడం శుభ పరిణామమని గుర్రాజుపేట గ్రామ యాత క మిటీ డైరక్టర్ గుత్తుర్తి పాండురంగ అన్నారు. ఆ గ్రామంలో శనివారం సర్దార్ గౌతు లచ్చన్న జయంతి 116వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా లచ్చన్న చిత్రపటానికి పాండురంగ బీసీ విభాగం గీత కార్మిక మ హిళా నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శెట్టిబలిజ పేటలో రూ. 30 వేల విలువ గల 10 బెంచీ బల్లలను ఏర్పాటుచేశారు. మార్కెట్ యార్డు కమిటీ డైరెక్టర్ దమ్ము అప్పారావు ఆధ్వర్యంలో గీత కార్మికులు పాలకి వెంకన్న, కొర్ని బంగారు కాసులను సన్మానించారు. అనంతరం గ్రామంలో సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహాన్ని ఏర్పాటుచేయాలని తీర్మానం చేశారు. గీత కార్మికులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు పథకంపై హర్షం

ఎస్. రాయవరం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం అమలు చేస్తున్న ఉచిత బస్సు పథకం తో మహిళలకు ఎంతో మేలు చేకూరుతుందని టీడీపీ సీనియర్ నాయకుడు కందుల వెంకటేశ్వరరావు అన్నారు. స్త్రీ శక్తి పేరుతో ఉచిత బస్సు పథకం అమలుపై హర్షం వ్యక్తం చేస్తూ స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద శనివారం స్థానిక మహిళలు బస్సుకు టీడీపీ జెండాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఉచిత బస్సు సదుపాయాన్ని కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు కర్రి శ్రీనివాసరావు, తెలుగు మహిళా మండల అధ్యక్షురాలు కె. నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వ్యాన్ డ్రైవర్‌కు గాయాలు

నక్కపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఉపమాక హైవే జంక్షన్ వద్ద శనివారం జరిగిన ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ గాయపడ్డారు. తు ని నుంచి విశాఖవైపు సిలిండర్ల లోడుతో వెళ్తున్న వ్యాన్ ఉపమాక జంక్షన్ వద్ద ఆగివున్న లారీని ఢీకొంది. కొవ్వూరుకు చెందిన వ్యాన్ డ్రైవర్ సీహెచ్ కృష్ణ వ్యాన్ క్యాబిన్‌లో చిక్కుకుపోయాడు. పోలీస్ సిబ్బంది అతన్ని బయటకు తీశారు. గాయపడిన అతనిని ఆస్పత్రికి తరలించారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

తుమ్మపాలలో ఇసుక దందా!

▸▸ శారదా నది సమీప బంజరు, జిరాయితీ భూముల్లో ఇష్టారాజ్యంగా తవ్వకాలు ▸▸ రెండు చేతులా ఆర్జిస్తున్న అక్రమార్కులు ▸▸ కన్నెత్తి చూడని అధికారులు



తుమ్మపాల శివారులోని భూముల్లో ఇసుక తవ్వకాల వల్ల ఏర్పడిన భారీ గుంత

తుమ్మపాల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలంలోని మేజర్ పంచాయతీ తుమ్మపాలలో ఇసుక దందా కొనసాగుతోంది. అవకాశం ఉన్న చోట్లంతా తవ్వకాలు చేపడుతూ కొందరు అక్రమార్కులు రెండు చేతులా సంపాదిస్తున్నారు. వీరి ఆగడాలకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు చోద్యం చూస్తుండడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అనకాపల్లి పట్టణాన్ని ఆనుకొని ఉన్న తుమ్మపాల శివారు శారదా నది సమీపంలోని బంజరు, జిరాయితీ భూముల్లో తవ్వకాలు చేపడుతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా పొక్లెయినర్లతో ఇష్టారాజ్యంగా ఇసుకను తవ్వి నిర్మానుష్య ప్రాంతాల్లో నిల్వ చేస్తున్నారు. ఇక అక్కడి నుంచే ఇసుక వ్యాపార లావాదేవీలు సాగిస్తున్నారు. తుమ్మపాల నుంచి పది కిలోమీటర్ల లోపు ఇసుక యూనిట్ ధర రూ.మూడు వేల నుంచి నాలుగు వేల వరకు వసూలు చేస్తున్నారని ప్రచారంలో ఉంది. యూనిట్ల చొప్పున కాకుండా లారీ ఇసుక లోడును రూ.15 వేలు, ట్రాక్టర్ ఇసుక లోడును రూ.ఐదు వేల వరకు అమ్మకాలు సాగిస్తున్నారని అంటున్నారు. దూరాన్ని బట్టి ధరను నిర్ణయించి అధిక వసూళ్లకు పాల్పడుతున్నారు. దీంతో గృహ నిర్మాణదారులు గగ్గోలు పెడుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం..

తుమ్మపాల శివారు వెంకుపాలెం రోడ్డు శారదానదీ పరీవాహక ప్రాంతాల్లో ఇసుక వ్యాపారులు పలుచోట్ల తవ్వకాలు చేపట్టడంతో భారీగా గోతులు ఏర్పడ్డాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఆ గోతుల్లో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. దీంతో అటువైపుగా నిత్యం సంచారం చేసే పశువుల కాపరులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. మేతకు వెళ్లిన పశువులు ఆయా గోతుల్లో పడితే మృత్యువాత పడడం ఖాయమని హడలిపోతున్నారు.

తవ్వకందారులపై చర్యలు : తహసీల్దార్

తుమ్మపాల శివారులో జరుగుతున్న ఇసుక అక్రమ వ్యాపారం అంశాన్ని తహశీల్దార్ భాస్కర అప్పారావు వద్ద ప్రస్తావించగా, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇసుక తవ్వకాల ద్వారా ఏర్పడిన గోతుల్లో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని చెప్పారు. అక్రమార్కులు ఎంతటి వారైనా విడిచిపెట్టేది లేదని స్పష్టం చేశారు.



అమ్మకాలకు సిద్ధంగా ఉంచిన ఇసుక



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కల్యాణి, తదితరులు

'స్త్రీ శక్తి'పై సంబరాలు

▸▸ నరేంద్ర మోదీ, చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ్, లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం

▸▸ సూపర్ సిక్స్ పథకాల విజయవంతంపై బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ కల్యాణి ఆనందం

కశింకోట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా స్త్రీ శక్తి పథకాన్ని ప్రవేశపెట్టడంపై మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం ఇక్కడ ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేశ్ చిత్రపటాలకు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ పెదపాటి కల్యాణితో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. దీని ద్వారా గ్రామీణ నిరుపేద, మధ్య తరగతి మహిళలతో పాటు ఉద్యోగస్తులు కూడా లబ్ధి పొందుతారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాలను ప్రవేశపెట్టిన చంద్రబాబుకు ప్రత్యేకంగా ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పెంటకోట సుబ్బలక్ష్మి, కూటమి నాయకులు పెంటకోట రాము, తాకాశి కృష్ణ, వేగి సాయి, వేగి వెంకట్రావు, రాజారావు, ఈశ్వరమ్మ, బాబర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మృతదేహం కోసం ఏలేరు కాలువలో పడవతో గాలింపు

▸▸ మృతుడు కృష్ణాదేవిపేటకు చెందిన వ్యక్తిగా అనుమానం



ఏలేరు కాలువలో పడవపై మృతదేహం కోసం గాలిస్తున్న పోలీసులు

కశింకోట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : ఏలేరు కాలువలో మృతదేహం కోసం పోలీసులు పడవపై డ్రోన్ కెమెరాల సాయంతో గాలించారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. మండలంలోని అచ్చెర్ల గ్రామం వద్ద గల ఏలేరు కాలువలో మృతదేహాన్ని ఉన్నట్టు పోలీసులకు శనివారం ఉదయం పలువురు సమాచారం అందించారు. దీంతో సీఐ అల్లు స్వామినాయుడు, ఎస్ఐ మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. అప్పటికే నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో మృతదేహం కొట్టుకుపోయింది. దీంతో వారు పడవపై డ్రోన్ కెమెరాల సాయంతో వెతకసాగారు. చాల సేపటి తరువాత బంగారయ్యపేట వద్ద మృతదేహాన్ని గుర్తించారు. అప్పటికే అది పూర్తిగా కుళ్లిపోయి గుర్తుపట్టలేని విధంగా ఉంది. ఈ మృతదేహం అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట ప్రాంతానికి చెందిన వ్యక్తిదై ఉండవచ్చునని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇతని సంబంధీకులు ఎవరైనా ఉంటే తమను సంప్రదించాల్సిందిగా సీఐ తెలిపారు.

'ఆవఖండంలో ఆక్రమణలను అరికట్టాలి'



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్ భద్రం

తుమ్మపాల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : ఆవఖండంలో ఆక్రమణలపై ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆవఖండం పరిరక్షణ వేదిక కన్వీనర్ వైఎస్ భద్రం డిమాండ్ చేశారు. శనివారం అనకాపల్లిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పర్యావరణానికి విధ్వంసం కలిగేలా ఆవఖండంలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోక పోవడం తగదన్నారు. ఇక్కడ చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆవఖండం పరిరక్షణ వేదిక నాయకులు కనిశెట్టి సురేష్‌బాబు, గాడి బాలు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకింగ్ సేవలపై గ్రామాల్లో విస్తృత అవగాహన

సబ్బవరం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాయపురఅగ్రహారంలో సోమవారం ఉదయం బ్యాంకింగ్ సేవలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సబ్బవరం బ్రాంచ్ మేనేజర్ ఎ.రమేశ్ తెలిపారు. రిజర్వ్ బ్యాంక్ ఆదేశాల మేరకు గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలపై విస్తృతం అవగాహన కల్పించడంతో పాటు సేవలను మరింత విస్తరించడం ఈ కార్యక్రమం ఉద్దేశ్యంగా పేర్కొన్నారు. బ్యాంకు రీజనల్ మేనేజర్ ఏవీ రమణమూర్తి, జోనల్ మేనేజర్ దారాసింగ్ నాయక్ హాజరుకాను న్నట్టు చెప్పారు.

భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుక



అనకాపల్లి గొల్లవీధిలో కృష్ణుని ఊరేగింపులో నాగజగదీశ్వరరావు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాష్టమి వేడుకలను శనివారం ప్రజలంతా అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని విజయరామరాజుపేట, లక్ష్మీదేవిపేట, గౌరీ పంచాయతన ఆలయం, గొల్లవీధి, బైపాస్ రోడ్డులోని హరే కృష్ణ సత్సంగ మందిరంలో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి. సత్సంగ మందిరంలో గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుదాసు, భానుచందర్ తదితరులు పాల్గొన్నారు. 84వ వార్డు గొల్లవీధిలో యాదవ సంక్షేమ సంఘం నాయకులు బోడి వెంకటరావు ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. ఇందులో భాగంగా స్వామివారి విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు తొలు ఊరేగింపును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కోట్ని రామకృష్ణ, కుప్పిలి జగన్, కాండ్రేగుల సత్యనారాయణ, భర్ణికాన శ్రీనివాసరావు పాల్గొన్నారు. గౌరీ పంచాయతన ఆలయంలోని గౌరీ గీతా మందిరంలో కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. భక్తుల సహకారంతో వివిధ రకాల మిఠాయిలు, ఫలములతో స్వామివారిని అలంకరించారు. చిన్నారులకు రాధాకృష్ణుల వేషధారణ పోటీలు, ఉట్టి ఉత్సవం జరిగాయి. సంఘ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్ పాల్గొన్నారు. డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఈ వేడుకల్లో కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.



పరవాడలోని గొల్లలపాలెం ఆలయంలో బండారు పూజలు

కశింకోట : ఇక్కడి కోనేరు గట్టున ఉన్న యశోద కృష్ణ ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు భరణికాన బాబూరావు హాజరై పూజలు జరిపారు. సాయంత్రం కోలాటాలు, తోడపెద్దు సేవలు, భజనలతో పాటు గ్రామ పురవీధుల్లో ఉట్ల సంబరాన్ని జరిపారు. అనంతరం కృష్ణుని విగ్రహాన్ని నిమజ్జం చేశారు. సంఘ ప్రతినిధులు భరణికాన నరసింహమూర్తి, కూటమి నాయకులు వేగి గోపీకృష్ణ, సిదిరెడ్డి శ్రీనివాసరావు, పంచదార్ల సూరిబాబు పాల్గొన్నారు.

పరవాడ : మండల వ్యాప్తంగా కృష్ణాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నాయుడుపాలెం పంచాయతీ గొల్లపేటలో గల శ్రీకృష్ణుని ఆలయంలో మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, వైసీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైలా శ్రీనివాస్, స్థానిక నాయకులు కూండ్రపు సీతారామయ్య, చుక్క రామునాయుడు, కోన రామారావు, పైలా అప్పలనాయుడు శ్రీకృష్ణునికిపూజలు చేశారు. రావాడ పంచాయతీ బొట్టవానిపాలెంలో కృష్ణుని విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న, మాజీ ఎంపీటీసీ సారిపల్లి జోగినాయుడు, నాయకులు కె.కొండడు, బొట్టా నూకరాజు, కె.నాని, మొల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు. అలాగే, వెన్నెలపాలెం పంచాయతీ పరిధి గొల్లలపాలెం శ్రీకృష్ణుని ఆలయంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పూజలు నిర్వహించారు.



సబ్బవరంలో ఉట్టి కొడుతున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

సబ్బవరం : కృష్ణాష్టమిని మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. సబ్బవరం గోపాలనగర్‌లో గల శ్రీకృష్ణ మందిరంలో వేడుకలు మరింత వైభవంగా జరిగాయి. కోలాటం, తప్పెటగుళ్లు, బాణసంచా కాల్పులతో సందడిగా మారింది. ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ, మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, శాప్ చైర్మన్ పీటీవీఎస్ఎన్ రాజు, వైసీపీ నాయకుడు గండి రవికుమార్ పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో వాజపేయి కృషి అమోఘం

▸▸ వర్ధంతి సందర్భంగా కొనియాడిన బీజేపీ నాయకులు



అనకాపల్లిలో వాజపేయి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

కొత్తూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి వర్ధంతిని శనివారం అనకాపల్లి పట్టణంలో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశానికి వాజపేయి అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొణతాల అప్పలరాజు, గొర్లి రామునాయుడు, బొడ్డేడ నాగేశ్వరరావు, పలకా రవి, నర్సింగ్‌యాదవ్ పాల్గొన్నారు.

కశింకోట : తాళ్లపాలెంలో వాజపేయి వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పొన్నగంటి అప్పారావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దేశానికి వాజపేయి అందించిన సేవలను కీర్తించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నాయకులు అప్పికొండ అప్పారావు, పంచాడ గంగరాజు, ఉప్పలపు చిట్టిబాబు, సీహెచ్ శ్రీనివాస్, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



కశింకోట మండలం తాళ్లపాలెంలో...

ఆర్యవైశ్య విద్యార్థులకు ఉపకార వేతనాల అందజేత



ఉపకార వేతనాల పొందినవారితో నిర్వాహకులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి కన్యకాపరమేశ్వరీ దేవస్థానం ఆధ్వర్యంలో ఆర్యవైశ్య పేద విద్యార్థులకు ఉపకార వేతనాలను అందజేశారు. ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు, కాకినాడ ఐ బ్యాంక్ అధినేత బాదం బాలకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై రూ.రెండు లక్షల వరకు ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. పదో తరగతిలో పట్టణంలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థినిని సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ వుప్పల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర

అనకాపల్లి రూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) :జిల్లా పోలీస్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం పోలీస్ అధికారులు నిర్వహించారు. ఇందులో భాగంగా కార్యాలయ ఆవరణలో పేరుకుపోయిన పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యమని ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ టి.లక్ష్మి అన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ శాఖ అవినీతిని అరికట్టండి

▸▸ రైతుల పనులకు ప్రయోజనం ఆశిస్తున్న అధికారులు

▸▸ వ్యవసాయదార్ల సంఘ సమావేశంలో మాజీ మంత్రి 'దాడి'

అనకాపల్లి టౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ అధికారులు ప్రతి పనికి ఆర్థిక ప్రయోజనం ఆశించి రైతులను ఇబ్బందులు పెడుతున్నారని వ్యవసాయదార్ల సంఘం చైర్మన్, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు ఆరోపించారు. శనివారం సంఘ భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంట కాలువల ఆక్రమణ, పూడికతీతకు సంబంధించి తుమ్మపాల పంచాయతీ అభ్యంతరాలు, గాంధీ మార్కెట్‌లో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. ఇతర జిల్లాల నుంచి దిగుమతి అవుతున్న టమాటా వల్ల స్థానిక రైతుల కష్టానికి తగిన ఫలితం ఉండడం లేదన్నారు. టమాటాకు వాణిజ్య పంటగా గుర్తింపు లేకపోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడుతున్నట్టు చెప్పారు. రైతుల సమస్యల పరిష్కారానికి వ్యవసాయదార్ల సంఘం నిరంతరం పనిచేస్తుందన్నారు. అవినీతికి పాల్పడిన పట్టణ ఎస్ఐని ఏసీబీ అరెస్టు చేయడం అభినందనీయమన్నారు. ఏసీబీ అధికారులు రెవెన్యూ అధికారులపై కూడా దృష్టి సారించాలని రైతులు అభిప్రాయపడ్డారు. శిథిలమైన గ్రోయిన్లను శాశ్వత ప్రాతిపదికపై పునర్నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరుతూ రైతులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయదార్ల సంఘం ప్రతినిధులు విల్లూరి రాము, కాండ్రేగుల విశ్వేశ్వరరావు, కొణతాల శ్రీనివాసరావు, కర్రి దివాకర్, విల్లూరి మాధవరావు, కర్రి మోదినాయుడు, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి దాడి వీరభద్రరావు

భావితరాలకు స్ఫూర్తి గౌతు లచ్చన్న

▸▸ జయంత్యుత్సవంలో డీఆర్‌వో సత్యనారాయణరావు



లచ్చన్న చిత్రపటానికి పూలమాల వేస్తున్న డీఆర్‌వో సత్యనారాయణరావు

అనకాపల్లి కలెక్టరేట్ , ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య సమరయోధుడు గౌతు లచ్చన్న భావితరాలకు స్ఫూర్తి అని డీఆర్‌వో వై. సత్యనారాయణరావు అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో లచ్చన్న జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం మాట్లాడారు. నేటి తరానికి సర్దార్ గౌతు లచ్చన్న జీవిత చరిత్ర తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, అధికారులు పాల్గొన్నారు.



జిల్లా పోలీస్ కార్యాలయంలో డీఎస్పీ శ్రీనివాసులు నివాళి

జిల్లా పోలీస్ కార్యాలయంలో...

అనకాపల్లి రూరల్: జిల్లా పోలీస్ కార్యాలయంలో గౌతు లచ్చన్న జయంతి నిర్వహించారు. మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఈ.శ్రీనివాసులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూగౌతు లచ్చన్న స్వాతంత్ర్య సమరయోధుడే కాకుండా ప్రముఖ రాజకీయ నాయకుడని పేర్కొన్నారు. బడుగు, బలహీనవర్గాల కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



అనకాపల్లి సీపీఐ కార్యాలయంలో...

సీపీఐ కార్యాలయంలో...

తుమ్మపాల: మాజీ మంత్రి దివంగత సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని అనకాపల్లిలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాల కోసం జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి గౌతు లచ్చన్నగా పేర్కొన్నారు. తన 17వ ఏట నుంచి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని బ్రిటీష్‌వారిని ఎదురించడంతో పలుమార్లు జైలులో సైతం పెట్టారన్నారు. శెట్టి బలిజ సంఘం అధ్యక్షుడు విత్తనాల పోతురాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు రెడ్డి సన్యాసిరావు, పి.నానాజీ, బత్తిన సూర్యారావు, పి.నాగేశ్వరరావు, సీహెచ్.ఆంజనేయులు, సీపీఐ నాయకులు వైఎస్ భద్రం, మాధవరావు, సత్యనారాయణ, బాబు తదితరులు పాల్గొన్నారు.

బోరు తవ్వారు.. హెడ్ మరిచారు



హుకుంపేట రామాలయం వీధిలో తవ్వి వదిలేసిన బోరు

హుంకుంపేట ఆగస్టు 16 ఆంధ్రజ్యోతి: స్థానిక రామాలయం వీధిలో బోరు తవ్వకం పనులు అసంపూర్తిగా వదిలేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. రెండు నెలల కిందట వీధిలో డ్రిల్లింగ్ ద్వారా రిగ్ తవ్వకాలు చేపట్టారు. మోటార్, పైన హెడ్ వేయకుండా వదిలేశారు. ఇంత వరకు కాంట్రాక్టర్ కానీ, అధికారులు కానీ కనిపించలేదని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వీధిలో తాగునీటి సమస్య గత 10 సంవత్సరాలుగా వేధిస్తోంది. దూరంనుంచి నీటిని తీసుకువచ్చి వినియోగిస్తున్నట్టు పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోరు బావి పనులు ప్రారంభకావడంతో తమకు తాగునీటి కష్టాలు తీరుతాయని భావిస్తే.. ఇలా ఆశాభంగం ఎదురైందని వాపోతున్నారు. ఇకనైనా అధి కారులు స్పందించి తాగునీటి బోరు పనులు వేగవంతం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీ చింతపల్లి మండల అధ్యక్షుడిగా రామచంద్రరావు



చింతపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా గెమ్మెలి రామచంద్రరావు నియమితులయ్యారు. పార్టీలో సీనియర్‌గా పనిచేస్తున్న అతనిని నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు సతక బుల్లిబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను ఈ పదవిలో నియమించడం సంతోషంగా ఉందని, పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. అధ్యక్షుడిగా నియమించిన జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర అధికార ప్రతినిధి కంకిపాటి వీరన్నపడాల్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

20న కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి రాక

చింతపల్లి: మండల కేంద్రంలో మాజీ కేంద్ర మంత్రి కిల్లి కృపారాణి ఈనెల 20న పర్యటించనున్నారని కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు వంతల సుబ్బారావు తెలిపారు. ఈ పార్టీ బలోపేతంపై ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహిస్తారన్నారు. ఒడిశా మాజీ మంత్రి జైరామ్ పాంగి, కాంగ్రెస్ పార్టీకి ముఖ్య నాయకులు సుంకరి పద్మశ్రీ, పోచారెడ్డి రాకేశ్‌రెడ్డి హాజరుకానున్నారన్నారు. ఆమె పర్యటనను పార్టీ కార్యకర్తలు, నాయకులు వజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్‌లో జీకేవీధి పార్టీ మండలాధ్యక్షుడు కిల్లో చిరంజీవి, మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ మొట్టడం బాలరాజు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మర్రి గురుమూర్తి పాల్గొన్నారు.

చిన్నారులకు పాదరక్షలు, గొడుగులు వితరణ



చెరువీధిలో వితరణ చేసిన పాదరక్షలు, గొడుగులతో చిన్నారులు

పెదబయలు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలం లోని పర్రెడా సచివాలయం పరిధిలోని గ్రామాల్లోని చిన్నారులకు పాదరక్షలు, గొడుగులు దేవా సోషల్ సర్వీసు నిర్వాహకులు వితరణగా అందించారు. స్థానిక సర్పంచ్ చెండా రవిశంకర్ ఆధ్వర్యంలో దేవా సోషల్ సర్వీస్ ప్రతినిధులు తరుణ్, రాజు, చందు శనివారం చెరువీధి, కుర్తాడి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలలోని 60 మంది బాలలకు వీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరు గ్రామాల పెద్దలు, గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రహదారులకు మహర్దశ

- సరిహద్దు గ్రామాల మధ్య కనెక్టివిటీ సదుపాయం
- మూడు మండలాల్లో

27 రహదారులకు రూ.46.34 కోట్లు మంజూరు



బొండాం కొత్తవలస నుంచి వయా బొండ్యాగుడ మీదుగా కితలంగి రోడ్డు వరకు నిర్మాణ పనులు

అరకులోయ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పీఎం జన్‌మన్ పథకం కింద మారుమూల పీవీటీజీ గ్రామాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టిసారించి తారురోడ్ల నిర్మాణాలకు చర్యలు చేపడుతున్నాయి. ఇందులో భాగంగా పలు మండలాల సరిహద్దు గ్రామాల్లో చక్కటి అనుసంధానంగా రవాణా సదుపాయం మెరుగుపడోంది. దీంతో గిరిపుత్రులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

మెరుగుపడనున్న రవాణా సదుపాయం

మండలంలోని బొండాం పంచాయతీ బొండాం కొత్తవలస గ్రామం నుంచి అనంతగిరి మండలం కోనాపురం గ్రామ పంచాయతీ పరిధి కితలంగి రహదారి వరకు పక్కా రోడ్డు నిర్మిస్తుండటంతో రెండు మండలాల సరిహద్దు పలు గ్రామాలకు రాకపోకలకు సదుపాయం కలుగుతోంది. బొండాం కొత్తవలస నుంచి కితలంగి గ్రామ రహదారి వరకు పీఎం జన్‌మన్ పథకం కింద రూ. 2.69 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం మట్టి పనులు ప్రారంభయ్యాయి. అలాగే, అరకులోయ, అనంతగిరి , డుంబ్రిగుడ మండలాల పరిధిలో సుమారు 27 రహదారులకు 50 కిలోమీటర్ల మేరకు 46.34 కోట్ల వ్యయంతో అబివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. ఈ పనులన్నీ పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరింగ్ ప్రాజెక్టు వారి పర్యవేక్షణలో జరుగుతున్నాయి. ఇవన్నీ పూర్తయితే, మారుమూల గ్రామాలకు రహదారుల సౌకర్యం కలుగుతుందని గిరిజనులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.





ఉమా నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న పాల్గొన్న చిన్నారులు, శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణ

ఉత్సాహభరితంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

పాడేరురూరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): పాడేరులో పురాతన శైవ క్షేత్రం ఉమానీలకంఠేశ్వస్వామి వారి సమేత రాజరాజేశ్వరి ఆలయ ప్రాంగణంలో ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలం నాయుడు, రమాదేవి దంపతుల ఆధ్వర్యంలో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఉత్సాహభరితంగా నిర్వహించారు. ముందుగా ఆలయ ప్రాంగణంలో భక్తులు, పురప్రజల సహకారంతో ఏర్పాటుచేయనున్న శ్రీకృష్ణ భగవానుని నిలువెత్తు విగ్రహ స్థాపనకు ప్రత్యేక పూజలు చేపట్టారు.చిన్నారులు శ్రీకృష్ణుని, గోపికల వేషధారణలో పాటలకు నృత్యాలు చేస్తూ సందడి చేశారు.ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల రామం పంతులు శ్రీకృష్ణ భగవానుని దివ్య సందేశాన్ని భక్తులకు వివరించారు. ఆలయ ధర్మకర్త సింహాచలం నా యుడు భక్తులకు భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. చిన్నారులు ఉట్టికొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు.భక్తులకు మహిళా బృంద సభ్యులు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి యూవీ రత్నం, శివరాత్రి శ్రీనివాస్ కుమార్, ఉపాధ్యక్షులు కొట్టగుళ్లి రామారావు, ఆలయ కమిటీ, ఆధ్యాత్మిక బృందప్రతినిధులు కె.భాగ్యలక్ష్మి, సిద్దినాతి కొండలరావు, కె.వెంకటరమణ, దేశిది బాబూరావు, పాల్గొన్నారు.

కొయ్యూరు: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను శనివారం శింగవరం గ్రామంలో యాదవ కుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామ కృష్ణాలయంలో విశ్వహిందూ పరిషత్ జాతీయ కార్యదర్శి సత్యం ఆధ్వర్యంలో యాదవ కుల సంఘ పెద్దలతో పాటు భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, గణపతి, శాంతి హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం శింగవరం, రాజేంద్రపాలెం, సురేంద్రపాలెం, కొయ్యూరు గ్రామాలలో పల్లకీ సేవ నిర్వహించారు. మేళతాళాలతో భక్తి సంకీర్తనల మధ్య భారీ ఊరేగింపు సాగింది. సాయంత్రం ఉట్టికొట్టే కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మ ప్రచారక్ మల్లిబాబు, విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు రామకృష్ణ, శివయ్య, వీర్రాజు, లక్ష్మి, సత్తిబాబు, ఎస్ఎఫ్ ప్రతినిధులు సన్యాసిరావు, లింగమూర్తి, హైందవ సైన్యం ప్రతినిధులు కృష్ణంరాజు, ఉష, నగేష్, స్థానిక ఆలయ ఉత్సవ కమిటీ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తాజంగిలో కన్నులపండువగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

చింతపల్లి: మండలంలోని తాజంగి గ్రామ పంచాయతీ బీటాలైన్ రాధాకృష్ణ ఆలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు కన్నులపండువగా జరిగాయి. స్థానిక గిరిజనులు బాలికలను గోపికలుగా, బాలురను కృష్ణుడిగా అలంకరించి ఈ వేడుకల వద్దకు తీసుకొచ్చారు. చిన్నారులు నృత్యాలతో సందడి చేశారు. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. గెలుపొందిన బాలుడికి నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహేశ్వరి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కోరాబు అంగదరావు, నిర్వాహ కమిటీ సభ్యుడు సదాశివ పాల్గొన్నారు.



తాజంగి బీటాలైన్‌లో సందడి చేస్తున్న గోపికలు, భక్తులు

ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి కృషి

- ఏపీజీఈఏ తాలూకా అధ్యక్షుడు సంజయ్‌కుమార్



సంఘ ఆవిర్భావ దినోత్సవ కేక్ కట్ చేస్తున్న ఏపీజీఈఏ ఉద్యోగులు, నాయకులు

చింతపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు ఏపీజీఈఏ ప్రత్యేక కృషి చేస్తుందని సంఘం చింతపల్లి తాలూకా అధ్యక్షుడు గుడ్ల సంజయ్ కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏపీజీఈఏ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రభుత్వ ఉద్యోగులు కేక్ కట్ చేశారు. మండల కేంద్రంలో యాచకులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తాలూకా అధ్యక్షుడు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారానికి సంఘం నాయకులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. . రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగుల విషయంలో సానుకూలంగా ఉందన్నారు. సంఘం సభ్యులు ఐక్యతగా ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శంకర్‌రావు, అసోసియేట్ అధ్యక్షుడు గసాడి పద్మనాభం, ఉపాధ్యక్షుడు తుచ్చ మధుసుదనరావు, నాయకులు సుమసుందర్, శోభన్ బాబు, కన్నబాబు, దామోదర్, బాబూరావు, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'సూపర్‌సిక్స్ పథకాలు శతశాతం అమలు'



రత్నంపేటలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్ర పటాలకు పాలాభిషేకం చేస్తున్న టీడీపీ శ్రేణులు

కొయ్యూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను శతశాతం అమలు కావడం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సాగిస్తున్న సుపరిపాలనకు నిదర్శనమని టీడీపీ అరకు పార్లమెంట్ బీసీ సగర సాధికారిక కన్వీనర్ నక్కా రాంబాబు పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలులోకి వచ్చిన సందర్భంగా శనివారం మండలంలో రత్నంపేట గ్రామంలో గిడ్డి ఈశ్వరి యువ సైన్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కూటమి నేతలు, మహిళలు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు ధన్యవాదాలు తెలుపుతూ వారి చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పాలన సాగుతోందన్నారు. రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి దిశగా అడుగులు పడుతున్నాయన్నారు. ఈ స్థితిలో ప్రభుత్వానికి మరింత సహాయ సహకారాలు అందించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకరరావు, అధిక సంఖ్యలో మహిళలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

బూసిపుట్టుకు ఉచిత ఆర్టీసీ బస్సు సర్వీసుపై హర్షం



బూసిపుట్టు చేరుకున్న బస్సు సర్వీసుతో ఆర్టీసీ అధికారులు, గ్రామస్థులు

ముంచంగిపుట్టు, ఆగస్టు (ఆంధ్రజ్యోతి) 16: మండలంలోని అత్యంత మారుమూల బూసిపుట్టుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉచిత బస్సు సర్వీసును ప్రారంభించడంపై గిరిజనులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. శనివారం ఆర్టీసీ అధికారులు ఈ గ్రామంలో బస్సు సర్వీసును ప్రారంభించారు. ఈ గ్రామానికి పక్కా రహదారి సౌకర్యం ఉన్నా, వివిధ కారణాలను చూపుతూ అధికారులు ఆర్టీసీ బస్సును నడపలేదు. దీంతో ఆ ప్రాంతీయులు గత కొన్నేళ్లగా రాకపోకలు సాగించేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు ఆర్టీసీ అధికారులు ఉచిత బస్సు సర్వీసును అటుగా నడపడంతో ఆ ప్రాంతీయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బూసిపుట్టుకు బస్సు రావడంతో పెదబయలు, ముంచంగిపుట్టు మండలాలకు చెందిన ప్రజలకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. ఈ సర్వీసును అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు తెలిపారు. నూతన బస్సు సర్వీసు అటుగా రావడంతో విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్ సియారి దొన్నుదొర, జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్‌లకు ఆ ప్రాంతీయులు ధన్యవాదాలు తెలిపారు.

టీడీపీ అనుబంధ సంఘాలకు ఏకగీవ్రంగా ఎన్నిక



ఎన్నికైన టీడీపీ అనుబంధ సంఘాల నాయకులు, పార్టీ కార్యకర్తలు

గూడెంకొత్తవీధి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో తెలుగుదేశం పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు పార్టీ మండలాధ్యక్షుడు పోత్తూరు కొండలరావు తెలిపారు. మండల కేంద్రంలో 16 పంచాయతీల టీడీపీ నాయకులు, కార్యకర్తలు సమావేశమయ్యారు. ఈమేరకు టీఎన్ఎస్ఎఫ్ మండలాధ్యక్షుడిగా గుంట బుజ్జిబాబు, కార్యదర్శిగా ముక్కలి ఐశ్వర్య, అంగన్‌వాడీ అధ్యక్షుడిగా మామిడి నాగేంద్ర, కార్యదర్శిగా సిరిబాల సంతోశ్ కుమార్, తెలుగు యువత అధ్యక్షుడిగా ముర్ల కోటేశ్వరరావు, కార్యదర్శిగా దేశగిరి గంగాధర్, వర్తక సంఘం అధ్యక్షులుగా రాజాపు రాజుబాబు, ఐటీడీపీ అధ్యక్షుడిగా ముర్ల భూపతిరాజు, కార్యదర్శిగా సాగిన అనిల్ కుమార్, తెలుగు రైతు సంఘం అధ్యక్షుడిగా కిల్లో సింహాచలం నియమితులయ్యారు. లీగల్ సెల్ అధ్యక్షులుగా ముక్కలి మహేశ్, ఎస్టీసెల్ అధ్యక్షులుగా పోతురాజు క్రిష్ణరాజు, కార్యదర్శిగా తిరుపల్లి మన్మదరావు, ట్రైకార్ అధ్యక్షులుగా మొట్టడం రాజుబాబు ఎన్నికైనట్టు కొండలరావు తెలిపారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీసెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కొర్ర బలరామ్, జిల్లా కార్యదర్శి ముక్కలి మహేశ్, మాజీ ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, నాయకులు మొట్టడం వీరవెంకట్ పాల్గొన్నారు.

19న పెసా ఎన్నికలపై శిక్షణ

చింతపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో పెసా ఎన్నికలు నిర్వహించేందుకు ఈనెల 19న ప్రిసైడింగ్ అధికారులు, పీవోలకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామని స్థానిక ఎంపీడీవో సీహెచ్ సీతామహాలక్ష్మి తెలిపారు. ఈనెల 29తేదీలోగా గ్రామసభలు నిర్వహించి పెసా కమిటీల ఉపాధ్యక్షులు, కార్యదర్శులకు ఎన్నిక నిర్వహించాల్సిఉందన్నారు. ఈమేరకు నిర్వహిసున్న శిక్షణకు ప్రిసైడింగ్ అధికారులు, పీవోలు విధిగా హాజరుకావాలన్నారు.

'అమలగుడకు రోడ్డు సౌకర్యం కల్పించాలి'

అనంతగిరి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతగిరి పంచాయతీ అమలగుడ గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందరావు శనివారం తెలిపారు. గ్రామంలో పది పీవీటీజీ గిరిజన కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని, రోడ్డు సౌకర్యం లేక ఎవరైనా అనారోగ్యం బారినపడినా, లేదా అత్యవసర సమయంలో గర్భిణులను డోలీమోతలపై తరలించాల్సి వస్తోందన్నారు. గ్రామానికి కొంతవరకు రోడ్డు పనులు చేశారని గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి నిధులు మంజూరు చేసి రోడ్డు నిర్మాణం పూర్తిచేయాలని కోరారు.

వారపు సంతలో సీఆర్‌పీఎఫ్ గస్తీ

ముంచంగిపుట్టు, ఆగస్టు (ఆంధ్రజ్యోతి) 16: మండల కేంద్రంలో శనివారం జరిగిన వారపు సంతలో ఉదయం నుంచి సాయంత్రం వరకు సీఆర్‌పీఎఫ్, స్థానిక పోలీసులు గస్తీ నిర్వహించారు. సంతకు వచ్చి, వెళ్లే వాహనాలను, ప్రయాణికుల లగేజీలను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. సంత పరిసరాల్లో కలియ తిరుగుతూ సాయంత్రం వరకు గస్తీ ఉన్నారు. మారుమూల గ్రామాల నుంచి సంతకు వచ్చే వాహనాలపై పోలీసులు ప్రత్యేక దృష్టిశారించారు.

హుకుంపేటలో పారిశుధ్య లోపం

- వీధుల్లో చెత్తా చెదారాలు... దోమలు విజృంభణ
- వ్యాధులు భయం.. పట్టించుకోని పంచాయతీ అధికారులు

హుకుంపేట ఆగస్టు 16 ఆంధ్రజ్యోతి: స్థానిక మెయిన్ రోడ్డు నుంచి అడ్డుమండ రోడ్డు వైపు పరిసరాల్లో చెత్తాచెదారాలతో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. ఇక్కడి పాత మంచి నీటి కుండి సమీపంలో పరిస్థితి మరీ దయనీయంగా మారింది. కొద్దిరోజులుగా వర్షాలు కురుస్తుండడంతో చిత్తడిగా మారి, దోమలు వృద్ధి చెందుతున్నాయి. పాతవైన్‌షాపు వద్ద ఇదే పరిస్థితి. ఫలితంగా మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధులు ప్రబలుతాయని స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వీధుల్లో సేకరించిన చెత్త, చెదారాలు తీసుకువచ్చి అడ్డుమండల రోడ్డులో వేస్తున్నారు. దీనికితోడు వర్షం వచ్చిన ప్రతిసారీ ఇక్కడికే పైనుంచి చెత్త కొట్టుకువస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. సరైన డ్రైనేజీలు లేక పోవటంతో వరద నీరు కాలువల్లో నిలిచి దుర్వాసనతో నిత్యం అగచాట్లు పడాల్సి వస్తోందని తెలిపారు. పంచాయతీ అధికారులు, నాయకులకు విషయం తెలిపినా, పట్టించుకోలేదని వాపోతున్నారు.



అడ్డుమండ రోడ్డు వైపు పేరుకుపోయిన చెత్త



పాత వైన్‌షాపు వీధిలో మురుగునీరు

ప్రమాదకరంగా ఘాట్ రోడ్డు

- డముకు వద్ద నిలిచిన వాహనాలు
- పర్యాటకుల అవస్థలు .. ఎన్‌హెచ్ అధికారుల నిర్లక్ష్యం

అనంతగిరి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): అరకు-విశాఖ ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. ప్రధానంగా మండల పరిధిలోని డముకు సమీపంలోని పెద్ద, పెద్ద గుంతలతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. శనివారం అరకు అందాలను తిలకించేందుకు అత్యధిక మంది పర్యాటకులు తరలివచ్చారు. వీరి వాహనాలు డముకు వద్దకు వచ్చేసరికి అక్కడి గుంతల వల్ల పెద్ద ఎత్తున నిలిచిపోయాయి. సుమారు రెండు కిలో మీటర్ల మేర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. దీంతో పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జాతీయ రహదారుల సంస్థ పట్టించుకోకపోవడం వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. నిత్యం వందలాది వా హనాలు రాకపోకలు సాగిస్తున్న ఈ మార్గంపై నిర్లక్ష్యం వహించడంపై పలువురు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. వారం రోజుల కిందట ఓ వ్యాన్ ఐరెన్‌లోడ్‌తో అరకువైపుగా వెళ్తుండగా, ఇక్కడి గుంతలో రెండు టైర్లు దిగి, అనంతరం రక్షణగోడను ఆనుకుని ఎడమవైపుగా ఒరిగిపోయింది. డ్రైవర్ అప్రమత్తంగా ఉండడం వల్ల ప్రమాదం నుంచి త ప్పింది. రక్షణగోడ లేకపోయి ఉంటే 200 అడుగుల లోయలోకి వాహనం బోల్తాపడి ఉండేదని వాహనదారులు ఆందోళన వ్యక్తచేస్తున్నారు. గుంతల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు తప్పించే క్రమంలో వాహనదారుల మధ్యలో వాగ్వాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రధాన రహదారి కావడంతో పర్యాటకుల వాహనాలు, ఆర్టీసీ, ఇతర వాహనాలు తరచూ వెళ్తుంటాయి. గుంతలను పూడ్చి, రోడ్డు మరమ్మతులు చేపట్టకుంటే పెను ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందని పలువురు పర్యాటకులు, ప్రయాణికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.



డముకు వద్ద ఛిద్రమైన రహదారి



ఘాట్‌రోడ్డులో శనివారం నిలిచిన వాహనాలు



నడుచుకువెళ్తున్న పర్యాటకులు

కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి

- నర్సీపట్నం మునిసిపల్ కౌన్సిలర్ రాజేశ్
- అన్నదాత సుఖీభవ అమలుపై ట్రాక్టర్ల ర్యాలీ



ట్రాక్టర్ల ర్యాలీని ప్రారంభిస్తున్న కౌన్సిలర్ చింతకాయల రాజేశ్

నాతవరం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ రైతుల పక్షపాతి అని నర్సీపట్నం మునిసిపల్ కౌన్సిలర్ రాజేశ్ పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ అమలుపై రైతులు ఆనందంగా ఉన్నారంటూ శనివారం డి.యర్రవరం గ్రామంలో ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. నాతవరం, గొలుగొండ మండలాల నుంచి ట్రాక్టర్లు డి.యర్రవరం రాగా అక్కడ నుంచి ఏడు కిలోమీటర్లు మేర ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ప్రారంభించిన అనంతరం నాతవరంలో ఏర్పాటు చేసిన సభలో రాజేశ్ మాట్లాడుతూ విత్తనాల కొరత లేకుండా చూస్తున్నామని రైతులకు నాణ్యమైన విత్తనాలను అందిస్తున్నామని చెప్పారు. అలాగే తాండవ రిజర్వాయర్ అభివృద్ధికి నిధులు మంజూరు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో తాండవ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ కరక సత్యనారాయణ, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన వీర సూర్యచంద్ర, ఏఎంసీ ఛైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, నాతవరం, నర్సీపట్నం మండలాల టీడీపీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ, శ్రీరంగస్వామి, నాయకులు ఎన్.విజయ్‌కుమార్, పారుపల్లి కొండబాబు, ఎస్.సన్యాసిదేముడు, పైల సూరిబాబు, ఇటంశెట్టి సీతారామ్మూర్తి, వి.కృష్ణారావు, ఎ.మాణిక్యం, ఎ.నానిబాబు, శెట్టి లోవ, పి.దాసు, కె.మరిడియ్య తదితరులు పాల్గొన్నారు.

1న ఏపీసీపీఎస్ఈఏ చలో విజయవాడ



చలో విజయవాడ పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీజీనాథ్

నర్సీపట్నం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీసీపీఎస్ఈఏ ఆధ్వర్యంలో వచ్చే నెల 1న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తామని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీనాథ్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఏపీసీపీఎస్ఈఏ జిల్లా గౌరవ అధ్యక్షులు అప్పలరాజు, సూర్యప్రకాశ్ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ పాత పెన్షన్ సాధన కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు కేవీ రమణారావు, డీవీఆర్ మూర్తి, గణేశ్ పాల్గొన్నారు.

ప్రధాన రహదారిలో ఆక్రమణల తొలగింపు

నర్సీపట్నం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయంగా లేకుండా ప్రధాన రహదారిలో ఆక్రమణలు తొలగించారు. పట్టణ ఇన్‌చార్జి సీఐ రేవతమ్మ ఆధ్వర్యంలో పోలీసులు ఈ కార్యక్రమం చేపట్టారు. ప్రధాన వీధులు, రద్దీ ప్రాంతాలలో పాదచారుల మార్గాలపై వీధి వ్యాపారులు ఏర్పాటు చేసుకున్న షెడ్ల తొలగించారు. మెయిన్ రోడ్డులో వాహనాల రాకపోకలకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకున్నామని ఈ సందర్భంగా సీఐ రేవతమ్మ తెలిపారు.

ఘనంగా 108 ఆవిర్భావ దినోత్సవం

నర్సీపట్నం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో 108 అంబులెన్స్ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. 108 వ్యవస్థ ఏర్పాటు చేసి 20 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రాంతీయ ఆస్పత్రిలో సీనియర్ అంబులెన్స్ సిబ్బంది ఎం.అప్పారావు, టి.దేవుళ్లను సన్మానించారు. 108 వ్యవస్థను మరింత మెరుగుపరచాలని వారు కోరారు. 108 వాహనాలను అత్యవసర సర్వీసులకు మాత్రమే ఉపయోగించాలని, రిఫరల్ కేసులకు ప్రత్యేక వాహనాలు ఏర్పాటుచేయాలని విన్నవించారు. కార్యక్రమంలో డాక్టర్ వివేక్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, 108 సంఘ నాయకులు ఎం.శ్రీనివాస్, జీఎస్‌టీ ప్రసాద్ పాల్గొన్నారు.

మృతదేహం కోసం గాలింపు

మృతుడు కృష్ణాదేవిపేటకు చెందిన వ్యక్తిగా అనుమానం

కశింకోట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఏలేరు కాలువలో మృతదేహం కోసం పోలీసులు పడవపై డ్రోన్ కెమెరాల సాయంతో గాలించారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. మండలంలోని అచ్చెర్ల గ్రామం వద్ద ఏలేరు కాలువలో మృతదేహన్ని ఉన్నట్టు పోలీసులకు శనివారం సమాచారం అందింది. దీంతో సీఐ అల్లు స్వామినాయుడు, ఎస్ఐ మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. అప్పటికే నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో మృతదేహం కొట్టుకుపోయింది. దీంతో వారు పడవపై డ్రోన్ కెమెరాల సాయంతో వెతకసాగారు. చాల సేపటి తరువాత బంగారయ్యపేట వద్ద మృతదేహన్ని గుర్తించారు. అప్పటికే అది పూర్తిగా కుళ్లిపోయి గుర్తుపట్టలేని విధంగా ఉంది. ఈ మృతదేహం అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట ప్రాంతానికి చెందిన వ్యక్తిదై ఉండవచ్చునని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇతని సంబంధీకులు ఎవరైనా ఉంటే తమను సంప్రదించాల్సిందిగా సీఐ తెలిపారు.

శిథిల గృహాలతో భయం.. భయం

- కూలిపోయే స్థితిలో పూరిళ్లు
- పట్టించుకోని అధికారులు.. ఆందోళనలో ప్రజలు

నాతవరం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కొత్తవీధిలో పలు చోట్ల పూరిళ్లు శిథిలమయ్యాయి. ఇవి ఎప్పుడు కూలిపోతాయో తెలియని దుస్థితికి చేరాయి. దీనికితోడు మట్టి గోడలు నానిపోయి ఉండడం.. మురుగునీరు బయట ప్రాంతాలకు పారకుండా నిల్వ ఉండిపోవడం.. పాములు చేరి ఆవాసాలు ఏర్పరచుకోవడం.. వెరసి పరిసరాల్లో ఆడుకునే చిన్నారులకు ఏమవుతుందోనని భయం.. భయంగా ఉందని తల్లిదండ్రులు, కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు.

దాదాపు మూడేళ్ల క్రితం కొంత మంది ఈ ఇళ్లను వదిలేసి వేరే ప్రాంతాలకు వెళ్లిపోయారు. దీంతో ఇళ్ల గోడలు వర్షాలకు నానిపోయి కూలిపడుతున్నాయి. అలాగే ఎవరూ వాటిలో ఉండకపోవడంతో శిథిల ఇళ్లలోనే పాములు, కీటకాలు ఆవాసాలుగా ఏర్పాటు చేసుకుంటున్నాయని, వర్షం నీరు ఉండిపోయి మురుగుగా మారుతున్నదని, వాటిని ఆనుకుని ఉన్న తమ ఇంటి గోడలు, ప్రహరీలు పాడువుతున్నాయని స్థానిక ప్రజలు చెబుతున్నారు. ఈ సమస్యను పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకు వెళ్లామని, నివాస గృహల మధ్యలో ఉన్న శిథిల ఇళ్లను తొలగించాలని, స్థల యాజమానులకు నోటీసులు ఇవ్వాలని కోరామని, అయినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలనీలోని నివాస గృహల మధ్యలో ఉన్న శిథిలమైన పూరిళ్లను తక్షణమే తొలగించాలని వారు కోరుతున్నారు.



నాతవరం కొత్తవీధిలో ఇళ్ల మధ్య శిథిల స్థితిలో ఉన్న పూరిల్లు

భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు

శ్రీకృష్ణాష్టమిని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అలాగే పలు చోట్ల యువకులు ఉట్టి కొట్టే కార్యక్రమాలను ఉత్సాహంగా నిర్వహించారు. చిన్నారులను శ్రీకృష్ణుడి వేషధారణలతో తల్లిదండ్రులు చూడముచ్చటగా అలంకరించారు.

నర్సీపట్నం/గొలుగొండ/కృష్ణాదేవిపేట/మాకవరపాలెం/నాతవరం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం పరిసర ప్రాంతాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి పండగను ఘనంగా నిర్వహించారు. నర్సీపట్నం శ్రీకృష్ణ మందిరం వద్ద భక్తులు క్యూలో ఉండి వేణుగోపాలుడిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణం వద్ద ఉట్టి ఉత్సవం నిర్వహించారు. యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అలాగే గొలుగొండ మండలంలోని గొలుగొండ, రావణాపల్లి, పాకలపాడు, గుండుపాల, ఎరకంపేట, ఎర్రవరం, అమ్మపేట, కొత్తమల్లంపేట, కృష్ణాదేవిపేట, ఏఎల్ పురం, చోద్యం, లింగంపేట, పాతకృష్ణాదేవిపేట, కొంగసింగి, నాగాపురం తదితర గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు జరుపుకున్నారు. గొల్లవీధిలోని కృష్ణుడు ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం వీధుల్లో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు.

మాకవరపాలెం మండల కేంద్రంలోని బీసీ కాలనీలో కృష్ణుడు గుడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అలాగే గిడుతూరు, రాచపల్లి, జి.వెంకటాపురం, నగరం, అడిగర్లపాలెం, సీతన్న అగ్రహారం తదితర గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. నాతవరం మండలంలోని నాతవరం, ఏపీ పురం, యాదవ్‌నాయుడుపాలెం, జిల్లేడిపూడి తదితర గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. యాదవ్‌నాయుడు పాలెంలో న్యాయవాది లోవ రాజు ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని ఆలయంలో వేడుకలు అట్టహసంగా జరిగాయి. ఉత్సవాల్లో నర్సీపట్నం మునిసిపల్ కౌన్సిలర్ చింతకాయల రాజేశ్, తాండవ ఛైర్మన్ కరక సత్యనారాయణ, నాయకులు దనిమిరెడ్డి మధు, పైల రమేశ్, ఎస్.సన్యాసిదేముడు, అంకంరెడ్డి నానిబాబు తదితరులు పాల్గొన్నారు.



నర్సీపట్నం శ్రీకృష్ణ మందిరం వద్ద క్యూలో ఉన్న భక్తులు

చోడవరం నియోజకవర్గంలో...



చోడవరం/రావికమతం/బుచ్చెయ్యపేట/రోలుగుంట: చోడవరం మండలంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే ఉట్టికొట్టడం, బాలకృష్ణ వేషధారణ పోటీలు ఏర్పాటు చేశారు. గంధవరంలోని గోపాలకృష్ణ ఆలయంలో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్, టీడీపీ సీనియర్ నాయకులు గూనూరు మల్లునాయుడు, మత్స్యరాజు దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ యువజన సంఘం నాయకులు తోనంగి అప్పలనాయుడు, పల్లా అర్జున, నానానీ, శ్రీనివాసరావు, మొల్లి నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

రావికమతం మండలంలోని కొత్తకోట, దొండపూడి, గొల్లలపాలెం గ్రామాల శ్రీకృష్ణాలయాల్లో శనివారం ఉదయం నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అలాగే ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా దొండపూడి గ్రామంలో పలువురు చిన్నారులను శ్రీకృష్ణా అవతారాల్లో అలరించారు. సాయింత్రం కొత్తకోట, దొండపూడి, గుమ్మాళ్ళపాడు గ్రామాలలో యువకులు ఎంతో ఉత్సాహంగా ఉట్టి సంబరం నిర్వహించారు. అలాగే ఉత్సవ కమిటీ, యువకులు శ్రీకృష్ణాష్టమి సందర్భంగా అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు.

బుచ్చెయ్యపేట మండలంలోని ఆలయాల్లో వేకువ జాము నుంచి పూజలు ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారికి పూజలు చేస్తారు. అలాగే అన్నదానం ఏర్పాటు చేశారు, సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఏర్పాటుచేశారు. వడ్డాదిలోని శ్రీకృష్ణుడు స్టేట్ హౌసింగ్ బోర్డు ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు రాజు స్వామివారిని దర్శించుకున్నారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదల సత్యనారాయణ పాల్గొన్నారు. వడ్డాదిలో శ్రీకృష్ణుడు కమిటీ సభ్యులు గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎంవీవీ.సత్యనారాయణ, దొండా నరేశ్, దొండాగిరిబాబు, సింగంపల్లి రమేశ్, శిరిగిరిశెట్టి శ్రీరామమూర్తి, దేవర అప్పారావు, దొండా సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా ఎల్‌బిపురం, బుదిరెడ్లపాలెం, కందిపూడి, తురకలపూడి, మల్లాం, ఆర్.శివరాంపురం, పెదపూడి, రాజుపాలెం తదితర గ్రామాలలో శ్రీకృష్ణ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ నిర్మాణంలో ఉన్నందున 40 సిమెంట్ బస్తాలను తెలుగుదేశం పార్టీ వడ్డాది టౌన్ అధ్యకుడు దొండా నరేశ్, వితరణగా అందించారు, సింగంపల్లి రమేశ్, ఆలయ కమిటీ సభ్యులు దొండా నరేశ్‌ను సత్కారించారు.



రావికమతం మండలంలోని గుమ్మాళ్లపాడులో ఉట్టి కొడుతున్న యువకులు

చీడికాడలో...

చీడికాడ: మండలంలోని అప్పలరాజుపురం, చుక్కపల్లి, బి.సింగవరం, దండిసురవరం గ్రామాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా స్వామివారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో భారీ అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు. అప్పలరాజుపురంలో జిల్లా స్థాయి భగవద్గీత పోటీలు నిర్వహించారు. చుక్కపల్లి, దండిసురవరం గ్రామాల్లో తప్పెడుగుళ్ల ప్రదర్శన జరిగింది.

సభ్య రైతుల అభ్యున్నతికి పాటుపడండి

- చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

రోలుగుంట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా సభ్య రైతుల అభ్యున్నతికి పాటు పడాలని చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు సూచించారు. రోలుగుంట పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ సుర్ల బాబులునాయుడు, సభ్యులు యర్రంశెట్టి వెంకట రమణ, బుంగా అప్పారావు శనివారం బాధ్యతలు చేపట్టారు. వీరిని ఎమ్మెల్యే రాజు సత్కరించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ సొసైటీ ద్వారా రైతులకు అన్ని సేవలను అందించి మంచి గుర్తింపు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుర్ల రామకృష్ణ, గుములూరు చంద్రమౌళి, బంటు రాజు, పోతల శ్రీనివాసరావు, రెడ్డి నారాయణరావు, పిట్ల బుల్లిబాబు, కోలిపల్లి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



చినపాచిల ఛైర్మన్ పరదేశినాయుడు, సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే రాజు

మూడు సంఘాల పాలక వర్గాలు ప్రమాణ స్వీకారం

రావికమతం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలకవర్గాల ప్రతినిధులు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. చినపాచిల, మేడివాడ, రావికమతం సంఘాల త్రిసభ్య కమిటీలతో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ప్రమాణ స్వీకారం చేయించారు. చినపాచిల సంఘ ఛైర్మన్‌గా కోన పరదేశినాయుడు, సభ్యులుగా గొంతిన సత్యారావు, బంటు నారాయమూర్తి, రావికమతం ఛైర్మన్‌గా ఉప్పులూరి నాగేశ్వరావు, మేడివాడ ఛైర్మన్‌గా గుటాల చిన్న ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడి పరమేశ్వరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కోమటి శంకరావు, నాయకులు ఈర్లె శ్రీరామమూర్తి, రాజాన కొండనాయుడు, గంజి మోదునాయుడు, గంజి సూర్యనారాయణ, వేపాడ నాగేశ్వరావు, కాళింగ తాతలు పాల్గొన్నారు.

నాలుగు సంఘాల ప్రతినిధుల బాధ్యతలు

బుచ్చెయ్యపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాలుగు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ప్రతినిధులు బుధవారం బాధ్యతలు చేపట్టారు. వీఆర్ఆర్ పేట ఛైర్మన్‌గా దోడ్డి కిశోర్, బంగారుమెట్టకు దొండా శ్రీను, బుచ్చెయ్యపేటకు డొంకిన అప్పలనాయుడు, తురకలపూడికి కోట సత్యనారాయణతో ఎమ్మెల్యే రాజు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం వారిని సత్కరించారు.

ఎన్నికల హామీలు నెరవేర్చడానికి కృషి

- ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

మాడుగుల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ ఎన్నికల హామీలను నెరవేర్చడానికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి పేర్కొన్నారు. మండలంలోని వీరవిల్లి అగ్రహారం గ్రామంలో శనివారం అన్నదాత సుఖీభవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో వేల కోట్ల రూపాయలను దుర్వినియోగం చేయడంతో రాష్ట్రం అప్పుల బాట పట్టిందన్నారు. దాని నుంచి తేరుకుని సీఎం చంద్రబాబు అనేక విధాలుగా ఆదాయ మార్గాలు ఎంచుకుంటున్నారని చెప్పారు. వీరవిల్లి పీఏసీఎస్ ఛైర్మన్ తలారి రమేశ్ సేవలను ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. కార్యక్రమమలో స్టేట్ హౌసింగ్ బోర్డు ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు, ఏఎంసీ ఛైర్మన్ పుప్పాల అప్పలరాజు, పెద్దేరు జలాశయం ఛైర్మన్ ఎ.జగ్గారావు, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, నాయకులు పైల ప్రసాదరావు, నాగేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి



హోం మంత్రి వంగలపూడి అనిత చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సీఐ అప్పలరాజు... తహసీల్దార్ రామారావు... లైన్ ఇన్‌స్పెక్టర్ నాగప్పారావు

ఉత్తమ సేవలకు పురస్కారాలు

చోడవరం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ సేవలు అందించిన పలువురు అధికారులు పురస్కారాలు అందుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ద్వారా ఈ అవార్డులు స్వీకరించారు. చోడవరం సీఐ బి.అప్పలరాజు ఉత్తమ సీఐగా హోం మంత్రి అనిత చేతుల మీదుగా అవార్డు, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. సీఐ అప్పలరాజుకు అవార్డు రావడంపై ఎస్ఐలు నాగేంద్ర, జోగారావు, సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు.

ఉత్తమ తహశీల్దార్‌గా రామారావు

తహశీల్దార్ అంబటి రామారావు ఉత్తమ తహశీల్దార్‌గా అవార్డును అందుకున్నారు. శుక్రవారం స్వాతంత్ర్య వేడుకల్లో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ చేతుల మీదుగా రామారావు అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ రామారావుకు రెవెన్యూ సిబ్బంది అభినందనలు తెలిపారు.

లైన్ ఇన్‌స్పెక్టర్ నాగప్పారావుకు అవార్డు

ఈపీడీసీఎల్ బుచ్చెయ్యపేట లైన్ ఇన్‌స్పెక్టర్ కనిశెట్టి నాగప్పారావుకు జిల్లా స్థాయిలో ఉత్తమ లైన్ ఇన్‌స్పెక్టర్‌గా అవార్డు లభించింది. హోం మంత్రి అనిత చేతుల మీదుగా అనకాపల్లిలో ఈ అవార్డును అందుకున్నారు. ఈ మేరకు ఈపీడీసీఎల్ అధికారులు, సిబ్బంది అభినందించారు.

కార్మిక సహాయాధికారికి...

కార్మిక సహాయాధికారి పి.సూర్యనారాయణ అల్లూరి జిల్లాలో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో ఉత్తమ అధికారిగా జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ అవార్డు అందుకున్నారు. అనకాపల్లి జిల్లాతో పాటు అల్లూరి జిల్లా కార్మిక సహాయ అధికారిగా పని చేస్తున్న సూర్యనారాయణకు ఉత్తమ అధికారిగా అవార్డు లభించింది. కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.



అల్లూరి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కార్మిక సహాయాధికారి... డీపీవో సందీప్ నుంచి అవార్డు అందుకుంటున్న వైకుంఠరావు

పంచాయతీ కార్యదర్శికి...

జిల్లాలో ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా గజపతి నగరానికి చెందిన కూడ వైకుంఠరావు డీపీవో సందీప్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. పంచాయతీ పరిధిలో సేవలకు గాను వైకుంఠరావు ఈ అవార్డును అందుకున్నారు.

చుక్కపల్లిలో జిల్లా స్థాయి ఎడ్లబండ్ల పరుగు పోటీలు

చీడికాడ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చుక్కపల్లి గ్రామంలో శనివారం మధ్యాహ్నం జిల్లా స్థాయి ఎడ్లబండ్ల పరుగు పోటీలు ప్రారంభమయ్యాయి. శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా జరిగిన ఈ పోటీలకు 15 బండ్లు రాగా, మైదానంలో హోరాహోరీగా పరుగెత్తాయి. వీటిలో కేఎల్‌బీపట్నంకు చెందిన బండారు హిమతేజ ఎద్దులకు ప్రథమ స్థానం రాగా, విజయనగరం జిల్లా వల్లంపూడి గ్రామానికి చెందిన శ్రీసిద్ది వినాయక ఎద్దులకు ద్వితీయ స్థానం, చుక్కపల్లికు చెందిన పేరపు నూకరాజు ఎద్దులకు మూడో స్థానం లభించాయి. స్థానిక టీడీపీ నాయకులు మురుకుర్తి బోగినాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు మజ్జి దేవానందం, ఎస్.తిరుమలనాయుడు, బి.వెంకటరమణ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. ఈ పోటీలను తిలకించేందుకు అధిక సంఖ్యలో రైతులు తరలివచ్చారు.

21న మరిడిమాంబ పండుగ



కృష్ణాదేవిపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని మేజర్ పంచాయతీ ఏఎల్ పురంలో ఈ నెల 21వ తేదీ మరిడిమాంబ పండుగను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ అలంకరణతో పాటు అమ్మవారి విగ్రహానికి రంగులు వేస్తూ ముస్తాబు చేసే కార్యక్రమాలు చేపడుతున్నారు. చుట్టు పక్కల గ్రామాల భక్తులు అమ్మవారి మొక్కులు తీర్చుకొని తీర్థప్రసాదాలన స్వీకరించాలని జడ్పీటీసీ మాజీ సభ్యుడు చిటికెల తారకవేణుగోపాల్ కోరారు. అలాగే సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

కృష్ణాదేవిపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని కృష్ణాదేవిపేటలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్టు సత్యసాయి సేవా సమితి సభ్యులు పల్లి సత్యనారాయణ, రమణ తెలిపారు. భగవాన్ సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఉదయం 9 గంటల నుంచి ఈ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. రక్తదానం చేయదల్చిన ప్రజలు ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. అలాగే 9440202297, 9441346407 నంబర్లకు ఫోన్ చేసి పేర్ల నమోదు చేసుకోవచ్చునని నిర్వాహకులు తెలిపారు.

చోడవరంలో మర్యాదరామన్న ఫేం నాగినీడు

ఆదర్శ రైతును కలిసిన నాగినీడు



ఆదర్శ రైతు గంగాధర్ కుటుంబంతో మర్యాదరామన్న ఫేం నాగినీడు

చోడవరం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ నటుడు, మర్యాదరామన్న ఫేం వెల్లంకి నాగినీడు శుక్రవారం చోడవరం శివారు అన్నవరం గ్రామానికి వచ్చారు. వ్యవసాయంపై ఆసక్తి ఉన్న నాగినీడు, స్థానికంగా ఆదర్శ రైతు పుల్లేటి గంగాధర్ ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా రైతు గంగాధర్ వద్ద కొన్ని పంటలకు సంబంధించిన మేలిమిరకం విత్తనాలను తన పొలంలో వేసేందుకు తీసుకు వెళ్లారు. ఈ సందర్భంగా రైతు గంగాధర్‌తో పాటు అతని సోదరులు గణేశ్, గంగాధర్ భార్యాపిల్లలతో కలిసి ఫొటోలు దిగారు.

మహిళలకు వరం.. స్త్రీశక్తి పథకం

ఉచిత బస్సు ప్రయాణాలకు విశేష స్పందన

సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీశక్తి పథకం మహిళలకు వరంలా పరిణమించింది. మహిళలు ఎక్కడైనా ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించడంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రారంభించిన ఈ పథకానికి విశేష స్పందన లభిస్తోంది. మహిళలు, విద్యార్థినులు ఉత్సాహంగా జీరో ఫేర్ టికెట్‌తో ప్రయాణిస్తున్నారు.

- అనకాపల్లి/ ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్



ఎలమంచిలిలో ఆధార్ కార్డు పరిశీలించి జీరో ఫేర్ టికెట్ ఇస్తున్న కండక్టర్

ఎంతో ఆనందంగా ఉంది



రాష్ట్ర ప్రభుత్వం స్త్రీశక్తి పథకం పేరుతో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచితంగా ప్రయాణించే అవకాశం ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉంది. పేద మహిళలకు ఈ పథకంగా నిజంగా వరం.

- ఎం.భవాని, గుణపూడి

సీఎం చంద్రబాబుకు రుణపడి ఉంటాం



రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిన స్త్రీశక్తి పథకం ఎంతో మంచిది. ఇప్పటికే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోంది. మహిళల ప్రగతి కోసం ఆలోచించే ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడుకు మేమంతా రుణపడి ఉంటాం.

- కరణం వరలక్ష్మి, మార్టూరు

ఖర్చు లేకుండా సింహాద్రప్పన్నను దర్శించుకున్నా..



కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో నేను ఎటువంటి ఖర్చు లేకుండా సింహాచలం వెళ్లి సింహాద్రి నాథుడిని దర్శించుకున్నాను. ఉచిత బస్సు సదుపాయం కల్పించి డబ్బులు ఆదా చేసుకొనేందుకు దోహదపడిన కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటాను.

- కొసిరెడ్డి లక్ష్మి, కూండ్రం గ్రామం, అనకాపల్లి మండలం

హాయిగా ప్రయాణిస్తున్నాం



కూటమి ప్రభుత్వం స్త్రీశక్తి పథకం పేరిట ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచితంగా ప్రయాణించే అవకాశం ఇవ్వడం గొప్ప విషయం. దీని వలన మేమంతా హాయిగా ప్రయాణిస్తున్నాం. ముఖ్యంగా చిరు వ్యాపారులు, విద్యార్థినులకు ఈ పథకం వలన ఎంతో మేలు జరుగుతుంది.

- పి.దేవి, కొత్తూరు, ఎలమంచిలి

ఉచిత బస్సు ప్రయాణం మంచిది



ఉచిత బస్సు ప్రయాణం పథకం చాలా మంచిది. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ మహిళల కోసం చంద్రబాబు ఈ పథకం తీసుకు రావడం చాలా గ్రేట్. ఇద్దరు పిల్లలతో విశాఖపట్నం ఉచితంగా ప్రయాణం చేస్తున్నాను. చాలా సంతోషంగా ఉంది.

- ఎం.సంధ్యారాణి, శివపురం, నర్సీపట్నం

ఎక్కడికైనా ప్రయాణించే అవకాశం



మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించిన కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు. ఆర్టీసీ బస్సుల్లో ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించే అవకాశం ఇవ్వడంతో మాకు ఎంతో ఆదా అవుతుంది. ఈ పథకం వలన పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుంది.

- వి.రూపావతి, అనకాపల్లి



అనకాపల్లిలో జీరో ఫేర్ టికెట్‌ను అధికారులకు చూపుతున్న మహిళా ప్రయాణికులు

రూ.125 చార్జీ మిగిలింది



విశాఖపట్నం ఉచిత ప్రయాణం చేయడం చాలా సంతోషంగా ఉంది. చింతపల్లి నుంచి నర్సీపట్నం వచ్చి ఈ బస్సు ఎక్కి విశాఖపట్నం వెళుతున్నాను. ఈ పథకంతో రూ.125 బస్సు చార్జీ మిగిలింది.

- జక్కా విజయలక్ష్మి, చింతపల్లి

మధ్య తరగతి మహిళలకు ఎంతో మేలు



మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేసేందుకు కూటమి ప్రభుత్వం అవకాశం కల్పించడం ఎంతో ఆనందంగా ఉంది. మాలాంటి మధ్య తరగతి కుటుంబాలకు ఎంతో సాయం అవుతుంది. నేను పాయకరావుపేట నుంచి అడ్డురోడ్డు వరకు ఉచితంగా ప్రయాణం చేస్తున్నాను.

- బత్తిన ఆశ, పాయకరావుపేట

ఉపమాక వెంకన్న క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

నక్కపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఉపమాక వేంకటేశ్వరస్వామి క్షేత్రానికి శనివారం ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. చాలా గ్రామాల్లో శనివారం కృష్ణాష్టమి వేడుకలను ప్రజలు జరుపుకున్నారు. ఈ మేరకు ఉపమాక వెంకన్న దర్శనం కోసం భక్తులు అనేక ప్రాంతాల నుంచి వచ్చారు. తెల్లవారుజామున కొండపై వున్న స్వామివారి నిజరూపానికి, కింద ఆలయంలో క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి, ఉభయదేవేరులతో కూడిన స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు, పట్టుపీతాంబరాలతో అలంకరణలు చేశారు. ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు, అర్చకులు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, భాగవతం సాయి గోపాలాచార్యులు, శ్రీనివాసాచార్యులు, ధూప,దీప నైవేద్యాలు, బాలభోగ, రాజభోగ నివేదనలు సమర్పించారు. భక్తుల గోత్రనామాలతో పూజా కార్యక్రమాలు చేశారు.



విశేష అలంకరణలో స్వామివారు

96.2 మీటర్లకు చేరిన కోనాం నీటిమట్టం

చీడికాడ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో కోనాం జలాశయం నీటిమట్టం భారీ స్థాయికి చేరింది. రెండు రోజులుగా జలాశయం ఎగువన పాడేరు, అనంతగిరి, హుకుంపేట మండలాల్లో భారీ వర్షం కురవడంతో రెండు మీటర్ల మేరకు నీటిమట్టం పెరిగింది. జలాశయం గరిష్ఠ స్థాయి నీటిమట్టం 101.25మీటర్లు కాగా, ఈనెల 14వ తేదీ నాటికి 94 మీటర్లుకాగా, శనివారం ఉదయం నాటికి 96.20 మీటర్లకు చేరుకుంది. ఇన్‌ఫ్లో 940 క్యూసెక్కులు కాగా, ఎగువ, దిగువ కాలువల ద్వారా 140 క్యూసెక్కులు సాగునీరు విడుదల చేస్తున్నామని నీటిపారుదల శాఖ ఏఈఈ బీవీ.సత్యనారాయణదొర శనివారం సాయంత్రం విలేకరులకు తెలిపారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.



కోనాం జలాశయానికి చేరిన కొత్తనీరు

ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

» 200 అడుగుల జాతీయ జెండాతో ప్రదర్శన

అనకాపల్లి టౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి పట్టణంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వాసవి క్లబ్ జిల్లా వి 2016ఏ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. వాసవి జిల్లా గవర్నర్ కొల్లూరి పార్వతి (పూర్ణిమ) ముఖ్యఅతిథిగా హాజరై ర్యాలీని ప్రారంభించారు. 200 అడుగుల జాతీయ జెండాతో నెహ్రూచౌక్ నుంచి పెరుగు బజార్ జంక్షన్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ప్రతినిధులు వెలగా కాశీపతి, హరినాథ్, నాగేశ్వరరావు, గంగరాజు, సీతారాం, కాసన్న, కృష్ణమూర్తి, వేణు, ఆర్‌సీ నాగేశ్వరరావు, లత, లక్ష్మి, తాయారు, సుశీలతో పాటు సూరే సతీశ్ తదితరులు పాల్గొన్నారు.



200 అడుగుల జాతీయ జెండాతో ప్రదర్శన ఇస్తున్న క్లబ్ ప్రతినిధులు, (ఇన్‌సెట్‌లో) ర్యాలీ నిర్వహిస్తున్న వాసవి క్లబ్ ప్రతినిధులు

నేడు పోలీస్ స్టేషన్ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన

» హాజరుకానున్న హోం మంత్రి, డీజీపీ

నక్కపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): దాదాపు మూడు దశాబ్దాల తరువాత నక్కపల్లి పోలీస్‌స్టేషన్‌కు కొత్త భవనం నిర్మించనున్నారు. సుమారు రూ.2.5 కోట్ల వ్యయంతో నక్కపల్లిలో నూతన భవనాన్ని నిర్మిస్తారు. స్థానిక హెటిరో సంస్థ సీఎస్‌ఆర్ నిధులతో ఈ భవనాన్ని నిర్మిస్తారు. ఆదివారం ఉదయం రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా శంకుస్థాపన చేస్తారని సీఐ కుమారస్వామి తెలిపారు. హైవేను అనుకుని వున్న పోలీస్ పెట్రోల్ బంకు సమీపాన పోలీస్ స్టేషన్ నూతన భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఎంపిక చేశారు. ఈ స్థలాన్ని ఇప్పటికే చదును చేశారు. శనివారం నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐ కుమారస్వామి, కూటమి నాయకులు ఈ స్థలాన్ని పరిశీలించారు.

అతివల ఆనందం

... 5వ పేజీ తరువాయి

తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీశక్తి పథకం ద్వారా కండక్టర్‌కు ఆధార్ కార్డు చూపితే జీరో ఫేర్ టికెట్ ఇచ్చారని చెబుతూ ఆ టికెట్‌ను అధికారులకు చూపించారు. పథకం ప్రారంభమైన శుక్రవారం సాయంత్రం ఐదున్నర నుంచి రాత్రి వరకు అనకాపల్లి కాంప్లెక్స్ నుంచి బస్సుల్లో 1,018 మంది మహిళా ప్రయాణికులు జీరో ఫేర్ టికెట్ ద్వారా ప్రయాణం సాగించినట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

ఎలమంచిలిలో..

ఎలమంచిలి: వివిధ ప్రాంతాల నుంచి ఎలమంచిలి ఆర్టీసీ బస్టాండ్‌కు శనివారం బస్సుల్లో వచ్చిన మహిళలు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఆధార్ కార్డు చూపించి ఎటువంటి చార్జీ చెల్లించకుండా జీరో ఫేర్ టికెట్‌తో ప్రయాణించామని చెప్పారు. అనకాపల్లికి చెందిన కొందరు మహిళలు తాము ఎలమంచిలిలో కేటరింగ్ పని మీద వచ్చామని, ఉచితంగా బస్సులో ప్రయాణించామని తెలిపారు. ఈ పథకం ద్వారా తమలాంటి వారికి నెలకు రూ.2 వేలు వరకు రవాణా ఖర్చులు మిగులుతాయని చెప్పారు. అయితే శనివారం కృష్ణాష్టమి సందర్భంగా సెలవు కావడంతో బస్టాండ్‌లో ఆశించిన స్థాయిలో ప్రయాణికులు కనిపించలేదు. సోమవారం నుంచి తాకిడి ఎక్కువగా ఉంటుందని భావిస్తున్నారు.

రంపచోడవరం టు నర్సీపట్నం

... 5వ పేజీ తరువాయి

అధికారులకు సమాచారం అందింది. దీంతో గొలుగొండ మండలం యర్రవరంలో ఉన్న చీడిగుమ్మల చెక్ పోస్టు సిబ్బందిని అప్రమత్తం చేశారు. శనివారం ఉదయం సోమిద మానుల లోడుతో వస్తున్న ట్రాక్టర్‌ను చెక్ పోస్టు సిబ్బంది ఆపి నర్సీపట్నం రేంజ్ అధికారి కేవీ రాజేశ్వరరావుకి సమాచారం ఇచ్చారు. కలపకు సంబంధించి సీపీజు మాత్రమే డ్రైవర్ చూపించారు. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి కలప రవణా చేయాలంటే తప్పనిసరిగా పర్మిట్ చలానా ఇవ్వాలి. ఫోక్స్‌పేట రేంజ్ అధికారి ఇచ్చిన రూ.50 వేలు సీపీజు చలానా మాత్రమే ఉండడంతో నర్సీపట్నం రేంజర్ ట్రాక్టర్‌ను డిపోనకు తరలించారు. సోమిద మానులు అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తి ఫోక్స్‌పేట అటవీ అధికారులకు భారీగా ముట్టచెప్పి పర్మిట్ లేకుండా మానులు తరలిస్తున్నట్టు సమాచారం. దేవస్థానాల పేరుతో కలప వ్యాపారులు సోమిద మానులను రూ.లక్షల్లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనిపై రేంజ్ అధికారి రాజేశ్వరరావును వివరణ కోరగా ముందుగా అందిన సమాచారం మేరకు సోమిద మానులతో ట్రాక్టర్‌ను పట్టుకున్నామని తెలిపారు. పర్మిట్ లేకపోవడంతో ట్రాక్టర్‌తో సహా కర్రను సీజ్ చేశామని చెప్పారు.

ట్రాఫిక్ పద్మవ్యూహం

... 5వ పేజీ తరువాయి

లేవు. అబీద్ సెంటర్ నుంచి ఐదు రోడ్ల కూడలి వరకు రోడ్డు ఇరుకుగా ఉండడం వలన తరచూ ట్రాఫిక్ నిలిచిపోతోంది. అబీద్ సెంటర్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు అదే పరిస్థితి ఉంది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో కళాశాలలు, పాఠశాలల విద్యార్థులతో మెయిన్ రోడ్డు రద్దీ కనిపిస్తుంది. దీనిపై నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావును వివరణ కోరగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక ప్రణాళిక తయారు చేయాలని పట్టణ సీఐని జిల్లా ఎస్పీ ఆదేశించారన్నారు. త్వరలోనే ప్రణాళిక తయారు చేసి నివేదిక అందజేస్తామని చెప్పారు.

క్రైం... crime news

ముమ్మరంగా మహిళ హత్య కేసు దర్యాప్తు

» ఆచూకీ చెబితే రూ.50 వేలు నగదు బహుమతి



మృతురాలి ఊహా చిత్రం

సబ్బవరం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారి బాటజంగాలపాలెం దరి రాజుగారి బంజరి వద్ద ఈ నెల 13న గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన కేసుకు సంబంధించి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని సీఐ జి రామచంద్రరావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అదే రోజు రాత్రి అనకాపల్లి- సబ్బవరం మధ్య రాకపోకలు సాగించిన వాహనాల సీసీ ఫుటేజీలను విశ్లేషిస్తున్నామన్నారు. పెట్రోల్ ఎక్కడ కొన్నది తెలుసుకునేందుకు అన్ని పెట్రోల్ బంకుల్లో సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నామని చెప్పారు. ఉమ్మడి విశాఖ జిల్లాతో పాటు చుట్టపక్కల జిల్లాల స్టేషన్లకు ఆ మహిళ ఊహా చిత్రం పంపించామన్నారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు సమాచారం ఇస్తే వారికి రూ.50 వేలు నగదు బహుమతి ఇస్తామని ప్రకటించామని ఆయన తెలిపారు.

వైద్యుడిపై మృతుడి భార్య ఫిర్యాదు

రాంబిల్లి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): వైద్యుడి నిర్లక్ష్యం వల్లే తన భర్త మృతి చెందాడని ఓ మహిళ ఫిర్యాదు చేసిందని రాంబిల్లి సీఐ నర్సింగరావు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. కొత్తపట్నం గ్రామానికి చెందిన శ్రీను(40) అనారోగ్యంతో శనివారం ఉదయం రాంబిల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరాడు. అతను ఆస్పత్రిలో చేరే సమయానికి బీపీ 270గా నమోదైంది. ఆస్పత్రి డ్యూటీ డాక్టర్ శ్రీనివాసరావు రక్త నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో శ్రీనుకు పల్స్‌రేట్ తగ్గడంతో డాక్టర్ శ్రీనివాసరావు సీపీఆర్ చేశారు. కానీ ఫలితం లేకపోయింది. శ్రీను మృతి చెందినట్టు డాక్టర్ నిర్ధారించారు. అయితే డాక్టర్ నిర్లక్ష్యం వల్లే తన భర్త మృతి చెందాడని అతని భార్య కాశీలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఏయూ మాజీ రిజిస్ట్రార్‌లకు బెయిలబుల్ వారెంట్లు

విశాఖపట్నం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం మాజీ అధికారులకు హైకోర్టు షాక్ ఇచ్చింది. వర్సిటీలోని థియేటర్స్ ఆర్ట్స్ విభాగానికి చెందిన ముగ్గురు అధ్యాపకులు (కన్సాలిడేటెడ్) తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ 2011లో హైకోర్టును ఆశ్రయించారు. అప్పటి నుంచి ఈ కేసు నడుస్తోంది. తాజాగా రెండు రోజుల కిందట విచారణకు వచ్చింది. ఈ కేసు మొదలైనప్పటి నుంచి రిజిస్ట్రార్లుగా పనిచేసిన ప్రొఫెసర్ నిరంజన్, ప్రొఫెసర్ ఉమామహేశ్వరరావు, ప్రొఫెసర్ కృష్ణమోహన్‌తోపాటు ప్రస్తుతం రిజిస్ట్రార్‌గా ఉన్న ప్రొఫెసర్ ధనుంజయరావు కోర్టుకు హాజరుకావాలని గత వాయిదా సమయంలో న్యాయమూర్తి ఆదేశించారు. అయితే, ప్రస్తుత రిజిస్ట్రార్ ధనుంజయరావు మినహా మిగిలిన ముగ్గురు కోర్టుకు హాజరుకాకపోవడంతో న్యాయమూర్తి తొలుత నాన్ బెయిలబుల్ వారంట్ జారీ చేస్తూ ఆదేశాలు ఇచ్చారు. అయితే, ఏయూ స్టాండింగ్ కౌన్సిల్‌కు చెందిన న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ ప్రస్తుత రిజిస్ట్రార్ కోర్టుకు హాజరయ్యారని, మరో ఇద్దరు వర్చువల్‌గా హాజరయ్యారని న్యాయమూర్తికి వివరించారు. అయితే కోర్టుకు నేరుగా హాజరుకావాలని చెప్పినప్పటికీ రాకపోవడాన్ని న్యాయమూర్తి తీవ్రంగా పరిగణించి ముగ్గురు మాజీ రిజిస్ట్రార్లకు బెయిలబుల్ వారెంట్ జారీచేస్తూ ఆదేశాలిచ్చారు. కేసు తదుపరి విచారణను ఈ నెల 21కి వాయిదా వేస్తూ, నలుగురు కోర్టుకు హాజరుకావాలని న్యాయమూర్తి స్పష్టంచేశారు.

పోలీస్ స్టేషన్లలో సెటిల్‌మెంట్లు!

... 5వ పేజీ తరువాయి

జరుగుతున్నట్టు తెలిసింది.

జనరల్ కానిస్టేబుళ్లను నియమించుకుని వసూళ్లు

జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో జనరల్ కానిస్టేబుళ్లను నియమించుకొని వారి ద్వారా వ్యాపారులు, రోడ్ల పక్కన దుకాణదారుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నట్టు సమాచారం. అనకాపల్లి, నర్సీపట్నం, రోలుగుంట, చోడవరం, మాడుగుల, దేవరాపల్లి, కె.కోటపాడు పోలీస్ స్టేషన్ల పరిధిలో జనరల్ కానిస్టేబుళ్లను నియమించుకున్నారు. ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణాదారులు, రేషన్ బియ్యం వ్యాపారుల నుంచి నెలవారీ మామూళ్లను వసూలు చేస్తున్నారు. జిల్లాలో ముఖ్యంగా జాతీయ రహదారిని ఆనుకొని వున్న అనకాపల్లి, కశింకోట, ఎలమంచిలి, ఎస్.రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట పోలీస్ స్టేషన్లలో రోడ్డు ప్రమాదాలు, ఇతరత్రా కేసుల్లో వచ్చేవారి నుంచి దండిగానే వసూళ్లకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. గతంలో నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల పరిధిలోని జాతీయ రహదారిపై పశువుల తరలింపు లారీల నుంచి బీటు కానిస్టేబుళ్లు దండుకుని మీడియాకు చిక్కిన విషయం తెలిసిందే. పరవాడ డివిజన్ పరిధిలో ఒక పోలీస్ స్టేషన్ వసూళ్ల కేంద్రంగా మారినట్టు తెలిసింది. పరవాడ, అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో పరిశ్రమలు ఎక్కువగా ఉన్నందున ఆయా పరిశ్రమల్లో ఎటువంటి వివాదాలు చెలరేగినా, ప్రమాదాలు జరిగినా పోలీసులకు దండిగా డబ్బులు చెల్లించుకోవాలని, లేదంటే కేసుల పేరుతో రకరకాలుగా వేధింపులకు గురికాక తప్పదని కొందరు పారిశ్రామికవేత్తలు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. అచ్యుతాపురంలో ఇటీవల అంతర్జాతీయ సైబర్ నేరగాళ్ల ముఠా గుట్టురట్టయ్యింది. అయితే రెండేళ్లుగా సైబర్ నేరగాళ్ల ముఠా స్థానిక పోలీసులకు భారీగా ముడుపులు చెల్లించినట్టు తెలిసింది. అనకాపల్లి రూరల్ పరిధిలో అధికంగా రోడ్డు మెటల్ క్వారీలు, క్రషర్లు ఉన్నాయి. ఆయా క్వారీల నిర్వాహకులు, రోడ్డు మెటల్ తరలించే ట్రాన్స్‌పోర్టు యాజమానులు లారీకి ఇంత అని ప్రతి నెలా సంబంధిత పోలీస్ స్టేషన్లకు నెలవారీ మామూళ్లు ముట్టజెప్పాల్సిందేనని తెలిసింది. ఇప్పటికైనా జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు పోలీస్ స్టేషన్లలో ప్రైవేటు పంచాయతీలపై దృష్టి సారించి, అక్రమ వసూళ్లను అడ్డుకోవాలని పలువురు కోరుతున్నారు.

వణుకుతున్న వంతెనలు

... 5వ పేజీ తరువాయి

అనుమతి ఉంది. అయితే రోలుగుంట ఒడ్డుమేట నుంచి రోజూ రేయింబవళ్లు రేవుపోలవరం సముద్ర తీరంలోని కంపెనీ నిర్మాణ పనుల కోసం సుమారు 50 టన్నుల సామర్థ్యంతో నల్లరాయి లోడుతో టిప్పర్లు, లారీలు నిత్యం యథేచ్ఛగా తిరుగుతున్నాయి. రోజూ సుమారు 50 నుంచి 70 లారీలు ఈ మార్గంలో వెళుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. అసలే శిథిలావస్థకు చేరిన ఈ వంతెనపై అధిక బరువుతో టిప్పర్లు, లారీలు తిరుగుతుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. మొన్నటి వరకు ఈ వాహనాలు నర్సీపట్నం మండలం పెదబొడ్డేపల్లి నుంచి మాకవరపాలెం మీదుగా తాళ్లపాలెం వరకు రాకపోకలు సాగించేవి. అయితే అధిక లోడుతో వస్తున్న వాహనాలపై తాళ్లపాలెం పోలీసులు కేసులు నమోదు చేస్తుండడంతో డ్రైవర్లు ఈ వాహనాల రూట్ మార్చి పెదబొడ్డేపల్లి నుంచి కోటవురట్ల మీదుగా అడ్డురోడ్డు వెళుతున్నారు. దీంతో ఈ మార్గంలో బలహీనంగా వంతెనలు ఏ క్షణంలోనైనా కూలిపోయే ప్రమాదం ఉంది.

దెబ్బతింటున్న రోడ్లు

మండలంలోని రామచంద్రపురం నుంచి రహదారి అడుగడుగునా గోతులమయంగా ఉంది. రామచంద్రపురం నుంచి అడ్డురోడ్డు వరకు సుమారు పది కిలోమీటర్ల మేర రహదారి అధ్వానంగా తయారైంది. ఈ మార్గంలో ఇందేశమ్మ ఘాట్‌రోడ్డు ఉండడంతో భారీ వాహనాల రాకపోకల వలన ఈ రోడ్డు దెబ్బతింటున్నది. కాగా మూడు రోజుల క్రితం అధిక లోడుతో వస్తున్న ఆరు భారీ వాహనాలను కోటవురట్ల పోలీసులు పట్టుకుని, ఆ తరువాత వదిలేశారు. దీంతో భారీ వాహనాలు యథేచ్ఛగా తిరుగుతున్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి నర్సీపట్నం నుంచి వస్తున్న భారీ వాహనాలను నిలుపుదల చేయాలని మండలంలోని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	105.00
లైవ్ ధర	125.00
విత్ స్కిన్	220.00
స్కిన్ లెస్	230.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	515
విజయనగరం	519
శ్రీకాకుళం	519